

ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 42.0
కనిష్ఠం : 22.0

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6.21 (బుధ)
సహరి : 4.47 (గురు)

కొల్లేరువాసుల్లో టెన్షన్.. టెన్షన్..



సుప్రీంకోర్టు కోరిన నివేదికపై ఉత్కంఠ

దక్షిణాసియాలో మంచినీటి సరస్సుగా పేరొందిన కొల్లేరు సరస్సు పరిరక్షణకు చర్యలు చేపట్టాలని సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆక్రమణలు, వన్యప్రాణి సంరక్షణ, కొల్లేరు హద్దులపై మూడు నెలల క్రితమే సుప్రీంకోర్టు ఆదే శాలు ఇచ్చింది. అదే సమయంలో మత్స్యకారుల జీవనోపాధికి అడ్డంకులు ఉండబోవని అవగాహన కల్పించాలని సూచించింది. కొల్లేరు సరస్సులో నీటి ప్రవాహాన్ని అడ్డుకుని వన్యప్రాణి సంరక్షణకు ప్రమాదకరంగా మారిన ఆక్రమణలపై సరైన నిర్ణయాలు తీసుకోవాలని స్పష్టం చేసింది. ఈ నెల 19లోపు తమకు నివేదించాలని సూచించింది. క్షేత్రస్థాయిలో అధికారుల సర్వే పూర్తి కాలేదు. రాష్ట్ర ప్రభుత్వం గడువు కోరుతుందా? ఏ నివేదిక ఇస్తుందని కొల్లేరు వాసులు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

సుప్రీం కోర్టు ఆదేశాల నేపథ్యంలో కొల్లేరువాసులంతా తమకు నష్టం జరుగుతుందని ఆందోళన చెందుతున్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీలను కలిసి గోడు వెళ్లబోసుకున్నారు. కొల్లేరు సరిహద్దులు గుర్తించాల్సి వస్తే తమ జీవనోపాధికి ఆటంకం లేకుండా చూడాలిన వారు కోరుతున్నారు. అటవీ ఉన్నతాధికారుల ఏలూరు రూరల్ మండల పరిధిలోని కొల్లేరు ప్రాంతాన్ని పరిశీలించారు. కొల్లేరు హద్దులను నిర్దేశించేవిధంగా ఇంతకుముందే ఉన్న సర్వేలను ఆధారంగా సరిహద్దు రాళ్లను గుర్తించారు. వాస్తవానికి కొల్లేరులో చేపల చెరువుల పేరిట దాదాపు 15 వేలకుపైగా ఎకరాలు ఆక్రమణకు గురైనట్టు ఇంతకుముందే ఉన్నత న్యాయస్థానం దృష్టికి కొందరు తీసుకువెళ్లారు. అధికారుల పరిశీలనలో 18 వేల ఎకరాలకు పైబడి ఆక్రమణలు గుర్తించినట్లు సమాచారం. మరింత లోతుగా పరిశీలిస్తే ఆక్రమణల భాగోతం బయటపడే అవకాశాలు లేకపోలేదని కొందరు భావిస్తున్నారు.

- ఆక్రమణలు, వన్యప్రాణి సంరక్షణ ఎలా..
- కొల్లేరు హద్దులు గుర్తించండి
- సరస్సులో మురగు, వ్యర్థాలు ఉండొద్దు
- ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశాలు
- నివేదిక సమర్పణకు నేటితో గడువు పూర్తి
- క్షేత్రస్థాయిలో పూర్తికాని సర్వే
- గడువు కోరడానికి ప్రభుత్వం సిద్ధం?

సుప్రీం కోర్టుకు నివేదించడానికి సాధ్యమైనంత మేర కొల్లేరు పరీవాహక ప్రాంతాన్ని అటవీ అధికారులు జల్లెడ పట్టారు. సరస్సులో భూభాగమంతా ప్రైవేటు వ్యక్తుల నియంత్రణలో ఉన్నట్టు బాహ్య ప్రపంచానికి తెలుసు. అసలు కొల్లేరు పరీవాహక ప్రాంతంలో దురాక్రమణపై దృష్టి సారించారు. వివిధ రాజకీయ పార్టీల అండదండలు ఉన్న ఆక్రమణలదారులపై ఫిర్యాదు చేయడానికి స్థానికులు జంకుతున్నారని కొందరు భావిస్తున్నారు.

ఇప్పుడేం జరగబోతుంది..!

కొల్లేరు పరిరక్షణ ధ్యేయంగా ఆక్రమణలను పూర్తిగా నిరోధించాలని సుప్రీంకోర్టు భావిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వానికి నిర్దిష్ట మైన ఆదేశాలు ఇచ్చింది. ఈ నెల 19 నాటికి నివేదికలు ఇవ్వాలని పేర్కొంది. కొల్లేరు హద్దులను నిర్ణయించడం, ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న మురుగు, వ్యర్థాలకు అడ్డుకట్ట వేయాల్సిందేనని సూచించింది. మత్స్యకారుల జీవనోపాధిపై అవగాహన కల్పించే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించింది. 2006 ఏప్రిల్ 10న సుప్రీం జారీ చేసిన ఉత్తర్వులను ఉల్లంఘిస్తున్న ప్రభుత్వ అధికారులపై చర్యలు తీసుకోవాలని కాకినాడకు చెందిన కొందరు సుప్రీంను ఆశ్రయించడంతో కొల్లేరులో అధికారుల హడావుడి కనిపించింది. అటవీ అధికారుల సర్వే కొంతవరకు పూర్తయింది. పూర్తిస్థాయి సర్వేకు మరింత సమయం పడుతుందని అధికారులు నివేదించినట్టు సమాచారం. ఇదే విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం దృష్టికి తీసుకువెళ్లే అవకాశం ఉంది. నివేదిక పరిశీలించిన తర్వాత సుప్రీం ఏం చేయబోతుందన్నదే అందరిలో ఉత్కంఠ.

ఇంటి పన్ను వసూళ్లు వేగవంతం

జిల్లాలోని 547 గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్నులు, ఇతర పన్నుల వసూళ్లు వేగవంతమయ్యాయి. గత ఏడాదితో పోలిస్తే పన్నుల వసూలు గణనీయంగా పెరిగినట్లు జిల్లా పంచాయతీ శాఖ నివేదికలు తెలియజేస్తున్నాయి. పన్నుల వసూళ్లపై డీపీవో అనూరాధ క్షేత్రస్థాయిలో పంచాయతీ, మండల డివిజన్ స్థాయి అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ దిశా నిర్దేశం చేస్తున్నారు.



జిల్లాలో 68.23 శాతం వసూలు

- బకాయిలపై అధికారుల దృష్టి
- నెలాఖరుకు నూరుశాతం వసూలు లక్ష్యం
- అధికారులతో డీపీవో సమీక్ష

ఏలూరు సిటీ, మార్చి 18(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఇంటి పన్నులు, కుళాయి, ఇతర పన్నులు వసూళ్లు జరుగుతున్నాయి. గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో అధికారుల పర్యవేక్షణతో పన్ను వసూళ్లు వేగవంతం అయ్యాయి. ఇంటి పన్నుల విషయాని కొస్తే జిల్లాలో ఇప్పటివరకు 68.23 శాతం, ఇతర పన్నులు 60.46 శాతం వసూళ్లు పూర్తయ్యాయి. పాత బకాయిలతో కలిపి నిర్దేశించుకున్న లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు వసూళ్లపై అధికారులు దృష్టి సారించారు.

డివిజన్ల వారీగా వసూళ్లు..

- నూజివీడు డివిజన్‌లో 129 గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్ను డింమాండ్ రూ. 11.56 కోట్లు. ఇందులో పాత బకాయి రూ.3.91 కోట్లు, ప్రస్తుత డిమాండ్ రూ.7.65 కోట్లు వరకు ఉన్నాయి. ఇప్పటివరకు రూ.8.09 కోట్లు 70.01శాతం వరకు ఇంటి పన్నులు వసూలయ్యాయి.
- జంగారెడ్డిగూడెం డివిజన్‌లో 167 గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్ను డిమాండ్ రూ. 16.17 కోట్లు ఉంది. ఇందులో పాత బకాయి రూ.713 కోట్లు, ప్రస్తుత డిమాండ్ రూ. 9.58 కోట్లు వరకు ఉంది. ఇప్పటివరకు మొత్తం పన్ను రూ. 10.24 కోట్లు 61.26 శాతం వసూలయ్యాయి.
- ఏలూరు డివిజన్‌లో 251 గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్ను డిమాండ్ రూ. 26.82 కోట్లు. ఇందులో పాత బకాయి రూ. 6.71 కోట్లు, ప్రస్తుత డిమాండ్ రూ. 20.11 కోట్లు. ఇప్పటివరకు రూ.19.26కోట్లు 71.81శాతం వరకు పన్నుల వసూళ్లు జరిగాయి.

అధికారుల సమీక్ష

జిల్లాలో పన్నుల వసూళ్లు ఇంకా వేగవంతమైతే నెలాఖరు నాటికి పూర్తిస్థాయిలో వసూలయ్యే అవకాశాలున్నాయి. ఈ దిశగా జిల్లా పంచాయతీ అధికారి కొడాలి అనూరాధ గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు. డీఎల్‌పీవోలు, ఈవోపీఆర్డీలు పంచాయతీ పన్నుల వసూళ్లపై ఎప్పటికప్పుడు సమీక్షించి గ్రామ పంచాయతీ కార్యదర్శులకు దిశానిర్దేశం చేయాలని డీపీవో సూచించారు.

ఇతర పన్నుల వసూలు..

- నూజివీడు డివిజన్‌లో ఇతర పన్నుల డిమాండ్ రూ. 5.30 కోట్లు కాగా పాత బకాయి రూ. 2.77 కోట్లు. ప్రస్తుత డిమాండ్ రూ. 2.53 కోట్లు ఉంది. ఇప్పటివరకు 3.42 కోట్లు 64.49 శాతం పన్నుల వసూళ్లు జరిగాయి.
- జంగారెడ్డిగూడెం డివిజన్‌లో ఇతర పన్నుల డిమాండ్ రూ. 12.41 కోట్లు. పాత బకాయి రూ. 5.75 కోట్లు ప్రస్తుత డిమాండ్ రూ. 6.65 కోట్లు. ఇప్పటివరకు రూ.7.25 కోట్లు 58.47 శాతం వరకు పన్నుల వసూలయ్యాయి.
- ఏలూరు డివిజన్‌లో ఇతర పన్నుల డిమాండ్ రూ.17.74 కోట్లు కాగా పాత బకాయి రూ. 6.82 కోట్లు, ప్రస్తుత డిమాండ్ రూ. 10.91 కోట్లు. ఇప్పటివరకు రూ.10.75 కోట్లు 60.64 శాతం వసూలయ్యాయి.

పోలీస్ స్టేషన్‌లో సామగ్రి మాయం!

- ఏలూరు త్రీటౌన్‌లో దొంగలు ఎవరు?
- ఇంటి దొంగలా.. బయటి వారా..!
- జంగారెడ్డిగూడెం డీఎస్పీ విచారణ

ఏలూరు క్రైం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఏలూరు త్రి టౌన్ పోలీస్ స్టేషన్‌లో వివిధ కేసుల్లో సొత్తు (నగదు, వస్తువులు) మాయమైంది. వస్తువులతో పాటు నగదు కూడా అపహరణకు గురైనట్లు అధికారులు గుర్తించారు. విచారణాధికారిని నియమించి ఆరా తీస్తున్నారు. స్టేషన్‌లో పనిచేస్తున్న వ్యక్తి వాటిని దుర్వినియోగం చేశాడా, లేదా ఇతరుల పాత్ర ఉందా అనే అనుమానాలు తలెత్తాయి. ఈ దిశగా పూర్తి స్థాయిలో విచారణ చేయడానికి జంగారెడ్డిగూడెం డీఎస్పీ రవి చంద్రను విచారణాధికారిగా నియమించారు. ఆయన మంగళవారం స్టేషన్‌లో వివిధ కేసులకు సంబంధించిన ప్రోపర్టీని పరిశీలించారు.

ఏలూరు త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో గతంలో ఏసీబీ దాడిలో సీఐ, ఇద్దరు కానిస్టేబుళ్లను అరెస్టు చేశారు. అప్పట్లో రైటర్‌గా పనిచేసిన వ్యక్తి డిప్యూటేషన్‌పై మాత్రమే విధులను నిర్వర్తించి ఆ తరువాత తమ పోలీస్ స్టేషన్‌కు వెళ్లిపోయారు. ఆ సమయంలోనే స్టేషన్‌లో కేసులకు సంబంధించిన ప్రోపర్టీ అపహరణకు గురైనట్లు భావిస్తున్నారు.

త్రీ టౌన్ సీఐగా బాధ్యతలు చేపట్టిన కోటేశ్వరరావు అన్ని కేసుల వివరాలు, ప్రోపర్టీ తెలుసుకోవడానికి రైటర్‌ను రికార్డులు, ప్రోపర్టీ అప్పజెప్పమని కోరినప్పటికీ రైటర్‌గా పనిచేస్తున్న వ్యక్తి సెలవులోకి వెళ్లిపోయాడు. దీంతో మధ్యవర్తుల సమక్షంలో స్టేషన్‌లో బీరువా తాళాలను తీయించి కేసులకు సంబంధించిన ప్రోపర్టీని లెక్కించారు. కొన్ని వస్తువులు, రూ.2లక్షలకు పైగా నగదు కూడా లేవని గుర్తించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో అప్పటి త్రీ టౌన్ రైటర్‌గా పనిచేసిన వ్యక్తిని సస్పెండ్ చేశారు. దీనిపైన పూర్తిస్థాయి విచారణకు జంగారెడ్డిగూడెం డీఎస్పీ రవిచంద్రను విచారణాధికారిగా ఎస్పీ నియమించారు. ఆయన త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం రాత్రి పొద్దుపోయినా తర్వాత కూడా కేసులకు సంబంధించిన రికార్డులు, ప్రోపర్టీ పరిశీలించారు. ప్రోపర్టీ దుర్వినియోగానికి పాల్పడిన వ్యక్తిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటారా లేదా సీసీఏ రూల్స్ క్రిమినల్ కేసు నమోదు చేసే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఒకటి రెండు రోజుల్లో పూర్తిస్థాయిలో విషయాలు వెల్లడి కానున్నాయి.

పేరుకే సొంతం!

రిజిస్ట్రేషన్లు జరగవు.. కాగితాలు ఉండవు

- నిషేధిత జాబితాలో కోట్ల ఆస్తులు
- 53/1బీ సర్వే నంబరులో 400పైగా ఇళ్లు, దుకాణాలు... 150 ఎకరాలు
- నరసాపురం స్టీమర్ రోడ్ నుంచిశివాలయం వరకు..
- రెండేళ్లుగా నిలిచిన లావాదేవీలు
- బ్యాంకు రుణం దక్కని పరిస్థితి
- స్థల యజమానులకు ఇబ్బందులు

నరసాపురం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): నరసాపురం స్టీమర్ రోడ్, మెయిన్‌రోడ్ ఖరీదైన ప్రాంతాలు, ఇక్కడ గజం స్థలం కొనాలంటే రూ.లక్ష చేతిలో ఉండాల్సిందే. మెయిన్‌రోడ్ అయితే మరో రూ.లక్ష కలపాలి. అయినా దొరకని పరిస్థితి. ఇలాంటి విలువైన ప్రాంతంలో ఎన్నో దుకాణాలు, నివాసాలు ఉన్నాయి. రెండేళ్లగా వాటిని అమ్ముకుందామంటే కొనేవాళ్లు లేరు. కనీసం బ్యాంకు నుంచి రుణం తీసుకుందామంటే ఆన్‌లైన్‌లో చూపించని పరిస్థితి. రిజిస్ట్రేషన్ల జరగవు. ఒకవేళ చేయాలనుకుంటే దానికి మరో నంబరు జత కలిపి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఇలా ఒకటి, రెండు కాదు 150 ఎకరాల్లో 400లకు పైగా ఇళ్లు, దుకాణాలకు క్రయ విక్రయాలు లేక స్థల యాజ మానులు రెండేళ్లుగా ఇబ్బందులు పడుతున్నారు. పిల్లల విద్య, పెళ్లిళ్లకు అవసరమైన బ్యాంకుకు వెళ్లి రుణం తీసుకుందామన్న దొరకని పరిస్థితి. ఏం చేయాలో తెలియక కార్యాలయాల చుట్టు ప్రదక్షిణలు చేస్తున్నారు. అధికారులు సర్వే చేసి సరిచేస్తామంటూ సర్దిచెబుతున్నారు. స్టీమర్ రోడ్‌లోని టేలర్ హైస్కూల్ నుంచి మెయిన్‌రోడ్, శివాలయం సెంటర్ వరకు వున్న మునిసిపల్ ప్రాంతంలోని సర్వే నంబరు 53/1బీలో ఈ పరిస్థితి నెలకొంది.

గత ప్రభుత్వ హయాంలో..

2023 వరకు ఈ సర్వే నంబరులో క్రయవిక్రయాలు యథావిధిగా జరిగేవి. సబ్ రిజిస్ట్రర్ కార్యాలయంలో ఈసీ తీస్తే ఆస్తి ఎవరి పేరు మీద ఉన్నది, తాకట్టులో ఉందా, లేక ఆస్తిదారు పేరునే ఉందన్న వివరాలు వచ్చేది. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన సర్వేతో సీన్ మారింది. 53/1బీ సర్వే నంబరును నిషేధిత జాబితాలో చేర్చారు. దీనికి అనేక కారణాలను చూపించారు. న్యాయస్థానం ఆదేశాలతో కొన్ని సబ్ డివిజన్లను నిలుపుదల చేస్తే మరికొన్నింటిని అప్పటి జిల్లా అధికారుల ఆదేశాలతో పూర్తిగా నిషేధిత ప్రాంతంలో చేర్చేశారు. ఈ సర్వే నంబరులో అత్యధికంగా ప్రభుత్వ ఆస్తులు ఉన్నాయి. స్టీమర్‌రోడ్‌లోని రాజగోపాలస్వామి, వైద్య ఆరోగ్యశాఖ ఖాళీ స్థలం, కనకదుర్గ ఆర్చి వద్ద దేవస్థానం సత్రం, దుకాణాలు, ఖాళీ స్థలం, ఇటు శివాలయం వద్ద బాలిక స్కూల్, కోర్టు, పోస్టల్ కార్యాలయం, సమీపంలోని ఎండోమెంట్ దుకాణాలు, ఆదికేశవ ఎంబర్‌మన్నార్ ఆలయ స్థలాలు ఉన్నాయి. ప్రభుత్వ స్థలాలు ఈసర్వే నంబర్‌లో ఉండడంతో వాటిని విడగొట్టి సబ్ డివిజన్లు చేయలేదు. ఈ భూములన్నీ రిజిస్ట్రేషన్లు కాకుండా అప్పటి అధికారులు నిషేధిత జాబితాలో చేర్చారన్న వాదనలు వినిపిస్తున్నాయి.



అమ్మకాలు సరే.. రుణాలు లేవు..

ఈ సర్వే నంబరును నిషేధిత జాబితాలో చేర్చడంతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. క్రయవిక్రయాలు జరగడం లేదు, డబ్బు అవసరమైనవారు అమ్ముకుందామంటే కొనేవాళ్లు అయినకాడికి అడుగుతున్నారు. దాన్ని కూడా 53/2లేదా 3 అని వేస్తేనే రిజిస్ట్రేషన్ అవుతుంది. ఈవిధంగా కొంతమంది ఆస్తుల్ని అమ్ముకున్నారు. అయితే లింకు డాక్యుమెంట్‌కు ఈసర్వే నంబరు సరిపోకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ కారణంగా ఈ సర్వే నంబరులోని ఇళ్లు, దుకాణాలు, ఖాళీ స్థలాలను కొనేందుకు ముందుకు రావడంలేదు. ఇక వ్యాపారులు రుణం తీసుకుందామంటే ఆన్‌లైన్‌లో ఈసర్వే నంబరును నిషేధితంగా మార్క్ చేసి కనిపి స్తుంది. బ్యాంకులు అప్పులు ఇవ్వడం లేదు. ఉన్నతవిద్యలకు విదేశాలకు వెళ్లే పిల్లలకు ఈ ఆస్తిని ష్యూరిటీగా చూపిద్దామంటే ఉపయోగంలేని పరిస్థితి నెలకొంది.

అధికారితో..

ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్

జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో మంచినీటి సమస్యలు, పారిశుధ్య సమస్యలు, ఇంటి పన్నులు, వీధి దీపాలు వంటి సమస్యలపై 19వ తేదీ బుధవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించే ఆంధ్రజ్యోతి ఫోన్‌ఇన్ కార్యక్రమంలో డీపీవో కొడాలి అనురాధ పాల్గొంటారు. ప్రజలు తమ సమస్యలను తెలియజేయాల్సిన సెల్ నెంబర్ 96663 08084 వాటి పరిష్కారానికి డీపీవో చర్యలు తీసుకుంటారు.



వట్లూరు కాలనీలో లబ్దిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

అసంపూర్తి గృహ నిర్మాణాలకు అదనపు సాయం

కలెక్టర్ వెట్రిసెల్వి

పెదపాడు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అసంపూర్తిగా నిలిచిపోయిన ఇళ్ల లబ్ధిదారులకు ప్రభుత్వం అదనపు సాయం అందిస్తుందని, ఏప్రిల్‌లోపు నిర్మాణాలు పూర్తి చేయాలని కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. వట్లూరు కాలనీని మంగళవారం ఆమె సందర్శించి మధ్యలో నిలిచిపోయిన ఇళ్లను పరిశీలించారు. గతంలో అందజేసిన యూనిట్ విలువ రూ. 1.80 లక్షలకు అదనంగా ఎస్సీ, బీసీలకు రూ. 50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు, ఆదివాసి గిరిజనుల (పీవీటీజీ)కు రూ.లక్ష చొప్పున అదనంగా అందించనున్నట్లు తెలిపారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేయడానికి గృహనిర్మాణ సిబ్బంది, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లు తగిన చర్యలు తీసుకుని లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు. కాలనీలో రహదారులు ఏర్పాటు చేయాలని లబ్ధిదారులు కోరగా అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటానని కలెక్టర్ తెలిపారు. ఆర్డీవో అచ్యుత్ అంబరీష్, గృహనిర్మాణశాఖ అధికారి జి.సత్యనారాయణ, డీఈ రమాకాంత్, అధికారులు పాల్గొన్నారు.

డిజిటల్ మార్కెటింగ్‌కు చర్యలు

ఏలూరు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివిధ పరిశ్రమల ఉత్పత్తులకు డిజిటల్ మార్కెటింగ్‌కు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లా పారిశ్రామిక, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ప్రభుత్వం పారిశ్రామికాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజర్ పి.సుబ్రహ్మణ్యేశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు, హార్టీకల్చర్ డీడీ రామ్మోహన్, ఎల్‌డీఎం నీలాద్రి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు త్వరితగతిన పరిష్కరించాలి

ఏలూరు క్రైం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. జడ్పీచైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, కమిటీ సభ్యులు జి మోహన్‌రావు, టి రాజేష్‌బాబు, ఎల్ ప్రవల్లిక, మట్టారాజు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..



ఇంటికో పారిశ్రామికవేత్త ప్రభుత్వ లక్ష్యం

పి.సుబ్రహ్మణ్యేశ్వరరావు
జీఎం, జిల్లా పరిశ్రమల కేంద్రం

ఏలూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఒక కుటుంబం.. ఒక పారిశ్రామికవేత్త నినాదంతో ప్రభుత్వం ఆహార శుద్ది ప్రాసెసింగ్ పాలసీ 4.0కు శ్రీకారం చుట్టింది. 2030 నాటికి ప్రతీ ఇంట్లో ఒక పారిశ్రామికవేత్త ఉండేలా విధానాలు రూపొందించి ఈ ఏడాది నుంచి అమలు చేస్తోంది. ఏలూరు జిల్లాలో నిరుద్యోగ యువత, పెట్టుబడిదారులు, స్వయం సహాయక సంఘాలు, ఇతర ఫెడరేషన్లు రాయితీలు పొంది పరిశ్రమల స్థాపించుకోవచ్చని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ పి సుబ్రహ్మణ్యేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో పలు అంశాలను వివరించారు. పారిశ్రామిక విధానాలపై ఆయన మాటల్లోనే..

? ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపన.. రాయితీలు..

జీఎం : ఎఫ్‌పీవోలు, స్వయం సహాయక సంఘాలు, వృత్తి ఫెడరేషన్లు, సహకార సంఘాలు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు స్థాపించవచ్చు. రెండేళ్లకు 35శాతం సబ్సిడీతో రూ.7కోట్లు వరకు రుణం పొందవచ్చు. సూక్ష్మ, చిన్న, పరిశ్రమలకు రూ.35 లక్షల నుంచి రూ.3.50 కోట్లు ఇస్తారు. మధ్య తరహా పరిశ్రమలకు 35 శాతం సబ్సిడీపై రూ.7 కోట్లు రుణం. భారీ పరిశ్రమలకు ఐదేళ్లలోపు 25 శాతం సబ్సిడీపై 15 కోట్లు వరకు రుణం పొందవచ్చు. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు 45 నుంచి 25 వరకు సబ్సిడీ ఉంటుంది. సూక్ష్మ తరహా పరిశ్రమలకు విద్యుత్ బిల్లు యూనిట్‌కు ఒక రూపాయి. ఏడాదికి రూ.లక్ష పరిమితి. పరిశ్రమ స్థాపించిన ఐదేళ్ల వరకు ఉంటుంది. చిన్న పరిశ్రమలకు రూ.5 లక్షల వరకు, మధ్యతరహా, భారీ పరిశ్రమలకు 15 లక్షలు వరకు పరిమితి ఉంది.

? సింగిల్ డెస్క్ విధానం అంటే..

జీఎం : పారిశ్రామిక ప్రగతిని వేగవంతం చేసేందుకు అన్ని శాఖలకు సంబంధించిన అనుమతులు ఒకేచోట లభించడమే సింగిల్ డెస్క్ విధానం. పరిశ్రమలు స్థాపనకు 15 రోజుల నుంచి 30 రోజుల్లో అనుమతులు పొందవచ్చు. www.apindustries.gov.inలో అనుమతి తీసుకోనే సౌలభ్యం ఉంది. ఈ ఏడాది జిల్లాలో 296 మంది దరఖాస్తు చేయగా 290 పరిశ్రమలకు అనుమతిలిచ్చాం. 3 పురోగతిలో ఉండగా, 3 తిరస్కరించాం.

? పరిశ్రమల అనుమతులపై సమీక్షలు..

జీఎం : జిల్లా స్థాయిలో కలెక్టర్ అధ్యక్షతన డీఐఈపీసీ (జిల్లా పరిశ్రమల స్థాపన కమిటీ)లో దరఖాస్తులపై చర్చించి, ఇంకా అవసరమైన ఉన్నా వాటిని రప్పించి, శాఖలతో చర్చించి అనుమతులను ఖరారు చేస్తాం.

? ఉద్యమ్ పోర్టల్‌లో నమోదు..

జీఎం: ఎస్ఎస్ఎంఈలు స్థాపించే వారు ముందుగా ఉద్యమ్ పోర్టల్‌లో వివరాలను నమోదు చేసుకోవాలి. యూనిట్లు మంజూరైనప్పుడు మార్జిన్ మనీ పొందడానికి ఇది తప్పనిసరి. ఇప్పటివరకు జిల్లాలో మొత్తం 9157 మంది నమోదు చేసుకున్నారు.

? ప్రధానమంత్రి ఉపాధి కల్పన (పీఎంఈజీపీ)..

జీఎం : జిల్లాలో పీఎంఈజీపీలో 63 యూనిట్లు స్థాపన లక్ష్యం. ఇప్పటికి 50 యూనిట్లకు మంజూరుకు బ్యాంకర్లు అనుమతిచ్చారు. 46 గ్రౌండింగ్ అయ్యాయి. బ్యాంకులు రూ.3కోట్ల మార్జిన్ విడుదల చేయాల్సి ఉండగా, 44 యూనిట్లకు రూ.2.57 కోట్లు రిలీజ్ చేశాయి.

? జిల్లాలో ఏ యే పరిశ్రమల స్థాపనపై స్పందన..

జీఎం: జిల్లాలో ఎక్కువగా డెయిరీ యూనిట్లను నెలకొల్పుతున్నారు. ఐస్‌క్రీమ్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, ట్రాక్టర్లు, షామియానా, చేపల పెంపకం తదితర యూనిట్లకు రుణాలు పొందుతున్నారు.

? నిరుద్యోగులు యూనిట్లను ఎంపిక చేసుకోవడం..

జీఎం: నిరుద్యోగులు బీసీ, ఎస్సీ, ఎస్టీ కేటగిరీల వారీగా సబ్సిడీ, ఇతర రుణ పరిమితులు తెలుసుకోవాలి. యూనిట్ల స్థాపనపై ప్రణాళికబద్ధ కార్యాచరణతో దరఖాస్తు చేసుకోవాలి. దళారులను ఆశ్రయించవద్దు. నేరుగా పరిశ్రమల కార్యాలయంలో వివరాలు తెలుసుకుని దరఖాస్తు చేసుకోవాలి.

బలి తీసుకుంటున్న బెట్టింగ్ యాప్‌లు
ఆర్థిక చిక్కుల్లో యువత 6

రింగా.. టెండరా?
మాధవాయిపాలెం రేవుకు 7
రికార్డు స్థాయిలో షెడ్యూల్ విక్రయాలు
ఆదాయానికి గండికొట్టేందుకు యత్నాలు


కాస్మో క్లబ్‌లో టెన్నిస్ ఆడుతున్న క్రీడాకారుడు

సత్తా చాటుతున్న సీనియర్లు

భీమవరంలో 4వరోజు టెన్నిస్ పోటీలు

భీమవరం అర్బన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : భీమవరం కాస్మోపాలిటన్ క్లబ్‌లో జరుగుతున్న 4వ వెరైటెక్స్ ఆల్ ఇండియా సీనియర్ ర్యాంకింగ్ టెన్నిస్ పోటీలు మంగళవారం కొనసాగాయి. వివిధ రాష్ట్రల నుంచి వచ్చిన టెన్నిస్ క్రీడాకారులు ఈ పోటీలలో పాల్గొని తమ సత్తా చాటుతున్నారు. 4వ రోజు జరిగిన వివిధ విభాగాలలో జరిగిన సింగిల్స్ పోటీలలో 35+లో కన్నాసెటూ, నితీస్ జాగ్సన్, సంతోష్, జానకీలు ఉన్నారు. 45+విభాగంలో ఎంవీఎల్ఎస్ రాజు, బాస్కరరావు, సంపత్, మధు, రామకృష్ణ, శివకుమార్ రాజులు గెలుపొందారు. 55+ రమేష్, ఎస్ఎస్ రాత్, బీజీ నగేష్, పాల్ మనోహార్‌లు విజేతలుగా నిలిచారు. కాస్మోపాలిటన్ క్లబ్, ఎస్ఆర్‌కేఆర్, డీఎన్ఆర్ క్రీడా మైదానాల్లో పోటీలు జరుగుతున్నాయని టెన్నిస్ రాష్ట్ర కార్యదర్శి రాంబాబు తెలిపారు.


విద్యార్థినుల మొబైల్‌లో శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేయించి అవగాహన కల్పిస్తున్న మహిళా పోలీస్ సుజాత

శక్తి యాప్‌తో క్షణాల్లో పోలీస్ సాయం

ఏలూరు క్రైం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఆపదలో ఉన్న సమయంలో శక్తి యాప్‌ను ఉపయోగించడం వల్ల ఒక్క క్షణంలో పోలీస్ సహాయాన్ని పొందవచ్చునని పోలీసులు విద్యార్థినులకు, యువతకు సూచించారు. ఏలూరు జిల్లా ఎస్పీ కిషోర్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో శక్తియాప్‌పై మహిళలకు, యువతులకు, విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఆండ్రాయిడ్ మొబైల్‌లో శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవడం వల్ల రక్షణ కోసం శక్తి టీమ్ సభ్యులు వెంటనే వస్తారని సూచించారు. ఎస్ఓఎస్ బటన్ నొక్కితే కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందుతుందని బటన్ నొక్కిన వారు ఏ ప్రాంతంలో ఉన్నా ఆ లోకేషన్ కూడా వారికి తెలియజేస్తుందన్నారు. మహిళా భద్రత కోసం టోల్ ఫ్రీ నెంబర్లు 112 (అత్యవసర సేవలు) సైబర్ నేరాల నివారణ కోసం 1930, బాల్య వివాహాల నివారణ కోసం 1098, ఏలూరు జిల్లా వాట్సాప్ నంబర్ 95503 51100కు సమాచారం అందించాలని సూచించారు. మహిళల రక్షణ కోసం అభయ పెట్రోలింగ్ బృందాలు కూడా నిరంతరం తిరుగుతున్నాయని అవగాహన కల్పించారు.

అవసరమైన వారికి ఎంఆర్ఐ చేయిస్తాం

ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ ఎంఎస్ రాజు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఏలూరు క్రైం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : సీటీ స్కాన్ మర మ్మతులు పూర్తయ్యేవరకూ ప్రత్యామ్నాయంగా ఎంఆర్ఐ స్కాన్ లను వినియోగించాలని వైద్యులను ఆదేశించినట్టు ఏలూరు ప్రభుత్వ సర్వజన బోధనాసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంఎస్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. 'ఆంధ్రజ్యోతి'లో మంగళవారం ప్రచురితమైన సీటీ స్కాన్‌కు సుస్తీ అనే కథనానికి ఆసుపత్రి అధికారులు స్పందించారు. సీటీ స్కాన్ నిర్వహణ ప్రభుత్వ ఆసుపత్రి పరిధిలోనిది కాదని ఎస్ఆర్ఐ అకాడమీ ద్వారా ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో నిర్వహిస్తున్నారని వీలైనంత త్వరలోనే మరమ్మతులు చేయించాలని ఎస్ఆర్ఐ సంస్థని ఆదేశించామన్నారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రి నుంచి పేషెంట్లను రిఫర్ చేయకుండా మరమ్మతులు పూర్తయ్యేవరకూ అవసరమైన వారికి ఎంఆర్ఐ నిర్వహించాలని ఆదేశించినట్టు రాజు తెలిపారు.

శివయ్యను తాకిన సూర్యకిరణాలు



కాళ్ళ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): సీసలిలోని అన్నపూర్ణా సమేత రామ లింగేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం అద్భుత సన్నివేశం చోటుచేసుకుంది. గర్భాలయంలోని శివలింగాన్ని సుమారు పది నిమిషాలపాటు సూర్య కిరణాలు తాకాయని ఆలయ అర్చకులు తెలిపారు. ఆదివారం నుంచి వరుసగా మూడు రోజులపాటు స్వామివారి లింగాన్ని సూర్యకిరణాలు తాకటం విశేషమని తెలిపారు. భక్తులు తరలివచ్చి అద్భుత సన్నివేశాన్ని వీక్షించారు.

బలి తీసుకుంటున్న బెట్టింగ్

కష్టపడకుండానే డబ్బు సంపాదించాలనే ఆశతో కొంతమంది జీవితాలు నాశనం చేసుకుంటున్నారు. ఒక్కసారిగా కోటీశ్వరుడు అయిపోదామనే అత్యాశతో జేబులు గుల్ల చేసుకుంటున్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లు కాస్తూ సొమ్ములు పోగొట్టుకుంటున్నారు.. అప్పులు చేసి అవి తీర్చే దారి లేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో ఈ రెండేళ్లలో 20 మందిపైనే ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు బలి అయినట్టు తెలుస్తోంది.



సెల్‌ఫోన్లలో బెట్టింగ్ యాప్‌లు

మాయలో పడిపోతున్న యువత

అప్పులు చేసి మరీ ఆటలు

తీర్చేదారిలేక ఆత్మహత్యలు

భీమవరం క్రైం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) :గతంలో బెట్టింగ్‌ల కోసం కొంత మంది ముఠాలు అమాయకులకు ఎరవేసి వారి ద్వారా బెట్టింగ్‌లు నిర్వహించేవారు. దళారులు సొమ్ములు కాజేసేవారు. ప్రస్తుతం ఆన్‌లైన్ యాప్‌లు రావడంతో ఇంటి వద్ద కూర్చొని బెట్టింగ్‌రాయుళ్ళు పందేలు కాస్తున్నారు. ఆన్‌లైన్ పేమెంట్ యాప్‌ల ద్వారా సొమ్ము లాగేసుకుంటున్నారు. జేబులు ఖాళీ అయ్యాక ఇంట్లో ఉన్న విలువైన వస్తువులు విక్రయించడం లేదంటే అధిక వడ్డీలకు అప్పులు చేసి చివరకు అవి చెల్లించలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో రెండేళ్లలో అలాంటి ఆత్మహత్యలు 15 వరకు జరిగినట్టు సమాచారం. యువత, విద్యార్థులు బెట్టింగ్ భూతానికి జీవితాలను బలి చేసుకుంటున్నారు. చేతిలో మొబైల్ ఫోన్ ఉండటంతో రకరకాల యాప్‌లు వినియోగించి బెట్టింగ్‌లు నిర్వహిస్తూ అప్పుల పాలవుతున్నారు. చివరకు కాలేజీకి కూడా వెళ్ళకుండా కొంతమంది ఈ యాప్‌లకు బానిసలయ్యారు.



యాప్‌లలో కూడా మోసాలు

బెట్టింగ్ యాప్‌లలో కూడా కొన్ని అనుమతులు లేని యాప్‌లు అందుబాటులోకి వచ్చాయి. పందెం రాయుళ్ళకు నకిలీ యాప్‌ల నిర్వాహకులు భారీగా ఆశలు చూపిస్తూ వారిని వలలో వేసుకుంటున్నారు. అసలైన యాప్ 10 ఓవర్లకు 80, 90 రన్స్ అని పెడితే నకిలీ యాప్‌ల వారు మాత్రం 60, 70 అని పెట్టి పందెం రాయుళ్ళను వారివైపు తిప్పుకుంటున్నారు. తీరా పందాలు కాసిన అనంతరం 8 లేదా 9 ఓవర్లు వచ్చిన అనంతరం రన్ రేటును వారే పెంచేసి పందేలు కాసేవారికి చుక్కలు చూపిస్తున్నారని పందెం వేస్తున్నవారు చెబుతున్నారు.

అడ్డదారులు తొక్కొద్దు

జయసూర్య, భీమవరం డీఎస్పీ



చాలామంది బెట్టింగ్ యాప్‌ల మాయలో పడి డబ్బులు పోగొట్టుకుంటున్నారు. అప్పుల పాలై చివరకు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. కష్టపడకుండా డబ్బులు సంపాదించాలనే ఆశ ఇటీవల కాలంలో బాగా పెరిగింది. యాప్‌లు తయారు చేసేవారు ఆదాయం కోసం బెట్టింగ్ రాయుళ్ళకు ఎరవేసి సొమ్ము చేసుకుంటున్నారు. ముఖ్యంగా యువత ఇలాంటి అడ్డదారుల్లోకి వెళ్ళవద్దు. తల్లిదండ్రులు కూడా పిల్లల భవిష్యత్ కోసం ఒక కంట వారిని కనిపెడుతూ ఉండాలి.

జీవితాలు నాశనం

- భీమవరం ఏఎస్ఆర్ నగర్‌కు చెందిన ఒక వ్యక్తి సుమారు ఏడాదిన్నర క్రితం బెట్టింగ్‌లో అప్పులు పాలై ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అప్పుల వారు ఒత్తిడి తేవడంతోనే ఆ పని చేసినట్లుగా ప్రచారం జరిగింది.
- భీమవరానికి చెందిన ఒక వ్యక్తి బెట్టింగ్‌లలో బాగా అప్పులపాలయ్యాడు. చివరకు ఉన్న ఆస్తులు అమ్మినా అప్పులకు సరిపోలేదు. అప్పులు ఇచ్చిన వారిని కొంత సమయం గడువు అడిగినా ఇవ్వకపోవడంతో పాలకోడేరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక చెరువు వద్ద పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.



- భీమవరం రెస్ట్‌హౌస్ రోడ్‌కు చెందిన ఒక వ్యక్తి ఏడాది క్రితం బెట్టింగ్‌కు పాల్పడి అప్పుల పాలయ్యాడు. భార్య కూడా పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్ళిపోవడం, అప్పుల ఒత్తిడి తట్టుకోలేక ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.
- తాడేపల్లిగూడెం మండలానికి చెందిన ఒకరు ఒక వ్యక్తిని నమ్మి అప్పు ఇచ్చాడు. ఆ వ్యక్తి బెట్టింగ్‌ల ద్వారా డబ్బు పోగొట్టడంతో అప్పు తీర్చమని అడగ్గా అతను సమాధానం చెప్పకపోవడంతో చివరకు అప్పు ఇచ్చిన వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.
- నర్సాపురం పట్టణానికి చెందిన ఒక వ్యక్తి నకిలీ యాప్‌ల ద్వారా బాగా డబ్బులు పోగొట్టాడు. అప్పులు ఒత్తిడి పెరిగిపోవడంతో ఆత్మహత్యాయత్నం చేశాడు. చివరకు ఆసుపత్రిలో కోలుకున్నాడు.

యువత కూరుకుపోతున్నారు..



ఏలూరు క్రైం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : మొబైల్ ఇప్పుడు నిత్యావసర వస్తువైపోయింది. ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్, మరే ఇతర అవసరాలకైనా ఖచ్చితంగా మొబైల్ నంబర్ అవసరం. స్మార్ట్‌ఫోన్లు ప్రతి ఒక్కరి చేతిలో కనిపిస్తున్నాయి. ఫోన్లలో రకరకాల గేమ్ యాప్‌లు వాటితో పాటు యాడ్స్ కూడా వచ్చేస్తున్నాయి. వీటిల్లో ఎక్కువశాతం బెట్టింగ్ యాప్‌లే.. టీవీ యాంకర్లు, యూట్యూబర్లు వీటిని ప్రమోట్ చేస్తున్నారు. బెట్టింగు యాప్‌ల ద్వారా తమకు లక్షలాది రూపాయలు వస్తున్నాయని చెబుతున్నారు. వారి మాటలు నమ్మి ఆ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకుని బెట్టింగులు మొదలెడుతున్నారు. బెట్టింగుల్లో మొదట డబ్బులు వస్తాయి. దీంతో నిద్రహారాలు మాని 24 గంటలు ఆన్‌లైన్‌లో ఆడేవారు కొంతమంది అయితే ఖాళీ దొరికితే ఆడేవారు ఇంకొందరు. ఒకరి నుంచి మరొకరు బెట్టింగు తెలుసుకుంటూ బ్యాంక్ అకౌంట్‌కు కాని, ఫోన్‌పేకు గాని లింకు చేసుకుంటూ గేమ్‌లు ఆడుతున్నారు. క్రికెట్‌పై బెట్టింగు, ఇతర గేమ్‌లు ఆకర్షణీయంగా పెట్టడంతో చాలా మంది వరకూ వీటిల్లో మునిగిపోతున్నారు. దీనికోసం అప్పులు చేస్తున్నారు.. వస్తువులను తాకట్టుపెడుతున్నారు. ఈ గేమ్‌లకు బానిసలై అప్పుల్లో కూరుకు పోయి చివరకు ఎవరికి చెప్పుకోలేని పరిస్థితుల్లో ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకూ 17 మంది ఆత్మహత్య లకు పాల్పడ్డారు. కొంత మంది కుటుంబ అవసరాల కోసం అప్పులు చేయగా, మరికొంత మంది బెట్టింగు యాప్‌లకు బానిసలై అప్పుల పాలైనవారు ఉన్నారు. ఏలూరు వన్‌టౌన్ ప్రాంతంలోని ఒక విద్యార్థి డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతూ బెట్టింగు యాప్‌లకు బానిసై చివరకు స్నేహితుల వద్ద అప్పులు తీర్చే మార్గం కానరాక ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. జిల్లాలో చదువుకున్న చదువులేని యువకుల మొబైల్స్‌ను పరిశీలిస్తే ఖచ్చితంగా బెట్టింగు యాప్‌లు ఉంటున్నాయి. బెట్టింగ్ యాప్‌లను ప్రచారం చేస్తున్న యూట్యూబర్లపై తెలంగాణ, హైదరాబాద్‌లో పోలీసులు కేసులు నమోదు చేయడం ఆ కేసును ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ పరిశీలనకు తీసుకోవడంతో సంచలనం కలిగించింది.

తల్లిదండ్రులు పరిశీలిస్తూ ఉండాలి



తల్లి దండ్రులు తమ పిల్లల అవసరాలకు ఫోన్లు ఇస్తున్నారు. ఆన్‌లైన్ క్లాస్‌లు, స్టడీ మెటీరియల్ వంటివి గూగుల్ ద్వారా తెలుసుకోవడానికి యాండ్రాయిడ్ ఫోన్లు అవసరమవుతున్నాయి. యాడ్స్ ద్వారా చాలామంది బెట్టింగ్‌యాప్‌ల ఆకర్షణకు లోనవుతు న్నారు. ఆ యాప్‌లను ప్రమోట్ చేసేవారు టీవీ, యూట్యూబ్, ఇతర సోషల్ మీడియాలో కనిపించే ప్రముఖులు ఆ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకుని గేమ్స్ ఆడుతున్నారు. తమకు తెలియకుండానే తమ గొయ్యి తామే తవ్వుకుంటున్నారు. తల్లి దండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై పరిశీలన చేసుకోవాలి. అలాంటి గేములకు బానిసలైతే వెంటనే మానసిక వైద్యులకు చూపించి తగిన కౌన్సెలింగ్ చేయించాలి.

- డాక్టర్ హరికృష్ణ, సాధారణ, మానసిక, ప్రత్యేక వైద్య నిపుణుడు, ఏలూరు

పశుగ్రాసానికి ఉపాధి హామీ

పశుగ్రాసం పెంపునకు పాడిరైతులకు అవకాశం

ఇరగవరం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : సన్నకారు రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నది. ఇప్పటికే మినీ గోకులాల పేరుతో షెడ్ల నిర్మాణాలకు అనుమతి ఇచ్చింది. తాజాగా పశుగ్రాస సాగుకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో పశుగ్రాసాన్ని పెంచుకునేందుకు అవకాశం కల్పించింది. ఇందుకు ఒక్కో రైతుకు 2 నుంచి 5 ఎకరాల వరకు పశుగ్రాసం పెంచడానికి ప్రోత్సాహం ఇస్తున్నది. వ్యవసాయంతో పాటు పాడిపశువుల పెంపుపై చాలా మంది రైతులు ఆధారపడి జీవిసున్నారు. 10 సెంట్ల నుంచి 2.5 ఎకరాల విస్తీర్ణంలో పశు గ్రాసం పెంచుకోవచ్చు. దీనికి తెల్ల కార్డు ఉండి జాబ్ కార్డు కలిగిన వారు అర్హులు. రైతులు, ఉపాధి కూలీలు స్వయం సహాయక సంఘాల మహిళలు వీటిని ఏర్పాటు చేసుకోవచ్చు. గ్రాసం వేసే భూమిని దుక్కి దున్నడం, విత్తనం, నాట్లు వేయడం, నీటి వినియోగం తదితర పనులు ఉపాధి పథకం ద్వారా చేస్తారు. అర్హులైన రైతులు సమీప పశువైద్యుడు లేదా రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకోవచ్చని పశు సంవర్ధకశాఖ అధికారులు చెబుతున్నారు. దరఖాస్తుతో పొలానికి సంబంధించి 1బి, జాబ్‌కార్డు, ఆధార్, రేషన్‌కార్డు, బ్యాంకు పుస్తకం జత చేయాల్సి ఉంటుంది. గ్రామ సభల ద్వారా ఎంపిక చేసిన లబ్ధిదారులు సాగు చేసుకోవచ్చు. ఎకరం భూమికి మూడేళ్ళకు రూ. 1.20 లక్షల మేర చెల్లిస్తారని అధికారులు తెలిపారు. పశుగ్రాసం పెంపకం పథకం రైతులకు ఎంతో ఉపయోగపడుతుందని తణుకు ఏరియా పశువైద్య శాఖ ఏడీఏ నరసింహారావు తెలిపారు. తణుకు నియోజకవర్గంలో మొత్తం సుమారు 8000 మంది పాడి రైతులు ఉన్నారు. వీరిలో 3855 ఆవులు, 19700 గేదెలు, 2544 గొర్రెలు, మేకలు ఉన్నాయన్నారు. ఆసక్తి ఉన్న రైతులు సమీపంలోని రైతు సేవా కేంద్రంలో గాని, పశువైద్యాధికారిని గాని సంప్రదించి దరఖాస్తు అందజేయాలని కోరారు.


ఇరగవరంలో పశువులకు మేతగా పెంచుతున్న గ్రాసం


ఉత్తమ ప్రదర్శనగా ఎంపికైన 'చిగురు మేఘం' నాటిక కళాకారులను సత్కరిస్తున్న సభ్యులు

ఉత్తమ ప్రదర్శనగా 'చిగురు మేఘం'

ముగిసిన పాలకొల్లు కళాపరిషత్ నాటకోత్సవాలు

పాలకొల్లు అర్బన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పాలకొల్లు కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన నాటిక పోటీలు సోమవారం రాత్రితో ముగిశాయి. గుంటూరు వారి అమరావతి ఆర్ట్స్ 'చిగురు మేఘం' నాటిక ఉత్తమ ప్రదర్శనగా నిలిచింది. ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా విశాఖ పట్నం వారి చైతన్య కళాస్రవంతి 'అ'సత్యం తృతీయ ఉత్తమ ప్రదర్శనగా కత్రపాడు ఉషోదయ కళానికేతన్ వారి కిడ్నాప్ నాటికలు ఎంపికయ్యాయి. విజయవాడ మైత్రీ కళా నిలయం వారి 'బ్రహ్మ స్వరూపం' నాటిక జ్యూరీ బహుమతికి ఎంపికైంది. ఉత్తమ రచయితగా విడాకులు కావాలి నాటిక రచయిత వల్లూరి శివప్రసాద్, ఉత్తమ దర్శకుడుగా అసత్యం దర్శకుడు బాలాజీ నాయక్ బహుమతులు అందుకున్నారు. ఉత్తమ నటుడిగా చిగురు మేఘంలోని చెన్నయ్య పాత్రధారి కావూరి సత్యనారాయణ, ఉత్తమ నటిగా ఇది రహదారికాదు నాటికలోని సముద్రాలు పాత్ర ధారిణి నాగరాణి, ఉత్తమ ప్రతినాయకుడిగా 'అ'సత్యంలో రఘుపతి పాత్రధారి అనిల్ కుమార్, ఉత్తమ హాస్య నటుడిగా మా ఇంట్లో మహాభారతం నాటికలోని వాసుదేవరావు పాత్రధారి పండు బహుమతులు సాధించారు. దిత్వీయ ఉత్తమ నటుడిగా అసత్యం లోని శివయ్య పాత్రధారి బాలాజీ నాయక్, ద్వితీయ ఉత్తమ నటిగా కిడ్నాప్ నాటికలోని వసుంధర పాత్రధారిణి అమృత వర్షిని, ఉత్తమ క్యారెక్టర్ నటుడిగా విడాకులు కావాలి నాటికలో శ్రీనివాస రావు పాత్రధారి గంగోత్రి సాయి, ఉత్తమ క్యారెక్టర్ నటిగా మా ఇంట్లో మహాభారతం నాటికలోని అన్నపూర్ణ పాత్రధారిణీ జ్యోతిరాణి బహుమతి సాధించారు. న్యాయ నిర్ణేతలుగా పంపన దయా నంద బాబు (కాకినాడ), గెద్ద వర ప్రసాద్ (విజయనగరం) గుత్తు చిన్నారావు (శ్రీకాకుళం)లు వ్యవహరించారు. కెవి కృష్ణ వర్మ అధ్యక్షతన జరిగిన బహుమతి కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మేకా శేషు బాబు, చెల్లం ఆనందప్రకాష్, జడ్పీటీసీ నడపన గోవింద రాజులు నాయుడు, పరిషత్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.


ఆచంటలో నిర్మానుష్యంగా మారిన ప్రధాన రహదారి

మండిన ఎండ.. వేడిగాలులతో ఉక్కిరిబిక్కిరి

ఏలూరుసిటీ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఎండలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. మంగళవారం అయితే ఉదయం నుంచి సాయంత్రం వరకు ఒక్కటే ఎండ.. వేడిగాలులు, ఉక్కబోతతో ప్రజలు అల్లాడిపోయారు. ఏలూరు జిల్లాలో 19వ తేదీ బుధవారం ఒక్క మండలంలో మాత్రమే వేడిగాలుల ప్రభావం ఉంటుందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. జిల్లాలోని వేలేరుపాడు మండలంలో వేడిగాలుల ప్రభావం ఎక్కువగా ఉంటుందని తెలిపింది. వేడిగాలులు నుంచి ఉపశమనానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరికలు జారీ చేసింది. మంగళవారం ఎండ తీవ్రతకు ఆచంటలో ఉదయం 11 గంటల నుంచి ప్రధాన రహదారులు నిర్మానుషంగా మారాయి. కలిదిండిలో మంగళవారం 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారాయి.


కలిదిండి మెయిన్ రోడ్డు

కోకో..కష్టాలు తీర్చేనా ?



అంతర పంటగా కోకో సాగు

మొగ్గు చూపుతున్న మెట్ట రైతులు

అంతర్జాతీయ ధరకు అనుగుణంగా ధర చెల్లించాలని రైతుల డిమాండ్

పెదవేగి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : అదనపు ఆదాయం కోసం రైతులు అంతరపంటల వైపు చూస్తున్నారు. అంతర పంటల్లో కోకోను ప్రధానంగా సాగు చేస్తున్నారు. మెట్ట ప్రాంతంలో ఎక్కువుగా సాగయ్యే కొబ్బరి, ఆయిల్‌పామ్, నిమ్మ వంటి ప్రధాన పంటలతో పాటు కోకో సాగు చేస్తున్నారు. దీంతో ఆర్థిక ఇబ్బందుల నుంచి కొంతమేర బయటపడుతున్నారు. ఏలూరు జిల్లాలో 32,451 ఎకరాల విస్తీర్ణంలో కొబ్బరి, ఆయిల్‌పామ్ తోటల్లో అంతరపంటగా కోకోను సాగు చేస్తున్నారు. పెదవేగి మండలంలోనే 8 వేల ఎకరాల వరకు సాగు జరుగుతోంది. ఏడాది పొడవునా కాపు ఉన్నప్పటికీ ప్రధానంగా మార్చి నెల నుంచి మే నెలాఖరు వరకు మూడు నెలల పాటు కోకో దిగుబడి బాగుంటుంది. ఈ సమయంలో వచ్చిన గింజలు అధిక నాణ్యత కలిగి, మెరుగైన ధర వస్తుందని రైతులు చెప్తున్నారు. ఎకరానికి సరాసరిన ఐదు క్వింటాళ్ళ దిగుబడి వస్తుందని తెలిపారు.

రికార్డు ధర నుంచి కిందకు..

కోకో గింజలు ఏడాది కిందటివరకు అత్యధిక ధర కిలో రూ.245. గతేడాది ప్రారంభ ధరే రూ.255. అక్కడ నుంచి పెరుగుతూ గత ఏప్రిల్ నెలాఖరు నాటికి రూ.వెయ్యి అందుకున్నారు. అక్కడ నుంచి క్రమేపీ తగ్గుతూ రూ.550 దగ్గర ఆగింది. ధర పెరుగుదలకు ప్రధాన కారణం కోకో ఎక్కువుగా పండించే ఘనా లాంటి ఆఫ్రికా దేశాల్లో పంట తెగుళ్లకు గురై తోటలన్నీ తొలగించడమేనని దీంతో దిగుమతి లేకపోవడంతో స్థానికంగా ఉన్న పంటకు డిమాండ్ పెరిగి ధర పెరిగినట్టు వ్యాపారులు చెబుతున్నారు ఇదిలా ఉంటే సరిగ్గా ఏడాది కిందట కిలో కోకో గింజల ధర రూ.వెయ్యి ఉంది. ఇప్పుడు గరిష్ట ధర రూ.600. దీంతో నష్టాలను ఎదుర్కొంటు న్నామని కౌలు రైతుల చెబుతున్నారు. గతేడాది ఉన్న ధరను చూసి ఈ ధర ఇలాగే ఉంటుందని భావించి, అధిక కౌలు చెల్లించి తోట తీసుకున్నామని, ఇప్పుడు తగ్గిన ధరతో కౌలు సొమ్ము కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు.


కొబ్బరిలో అంతర పంటగా కోకో సాగు

కొనుగోలు సంస్థల మోసం



వాతావరణంలో మార్పుల కారణంగా కోకో పంట దిగుబడి గణనీయంగా తగ్గింది. దాదాపు 20 శాతానికి దిగుబడి పడిపోయింది. ప్రతి సంవత్సరం ఎకరానికి సరాసరిన ఐదు క్వింటాళ్ళకు తగ్గకుండా దిగుబడి వచ్చేది. ఈ ఏడాది మూడు క్వింటాళ్ల మాత్రమే వచ్చింది. రైతుల అవసరాలు, ఆర్థిక ఇబ్బందులను కోకో గింజల కొనుగోలు సంస్థలు వాడుకుంటున్నాయి. ముందుముందు ధర మరింత పెరిగే అవకాశం ఉంటుంది.. నిల్వ చేయమని వారే చెప్తారు. ఆపై అవి పాతవి, నాణ్యత లేవు.. కొత్త గింజలతో సమానంగా ధర ఇవ్వలేమని చెప్పి కిలో రూ.240 కట్టి మోసం చేశారు. 12 ఎకరాలు కౌలుకు తీసుకున్నాను. ఇప్పుడు పెట్టుబడి కాదు కదా..కౌలు సొమ్ము కూడా వచ్చేలా లేదు..

- దూలిపూడి అశోక్, వేగవరం, దెందులూరు మండలం

ధరతో పాటు కౌలూ పెరిగింది



గతేడాది కోకో గింజల ధర ఒక్కసారిగా రూ.వెయ్యికి పెరగ డంతో తోటల కౌలు కూడా అమాంతం పెరిగింది. గతేడాది వరకు ఎకరం కోకో తోట రూ.40 వేల వరకు ఉండేది. అలాంటిది గింజల ధర పెరగడంతో ఎకరం రూ.1.20 లక్షలతో కొనుగోలు చేశా. కానీ అంతలోనే ధర రూ.600కు పడిపోవడంతో తీవ్రంగా నష్టపోయా. 20 ఎకరాలు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నా. ఎకరం రూ.1.20 లక్షలు కౌలుతో పాటు పెట్టుబడి మరో రూ.40 వేలతో ఎకరానికి రూ.1.60 లక్షలు వ్యయమైంది. ధర మాత్రం రూ.600లకు మించి లేదు. దీంతో పెట్టుబడి కూడా వస్తుందనే ఆశలేదు.

దారిబోయిన శ్రీనివాసరావు, విజయరాయి

కొనుగోలు సంస్థలు కుమ్మక్కు



కొనుగోలు సంస్థలు సిండికేట్‌గా మారి ధరలను తగ్గించి రైతులను దోచుకుంటున్నాయి. ధర తగ్గించే ఆలోచనతో కొనుగోలు సంస్థలు నాణ్యత పేరుతో కోకో గింజల కొనుగోలును నిలిపేశాయి. కొన్ని సంస్థలైతే పచ్చళ్ళు పట్టుకోండని ఎగతాళిగా మాట్లాడుతున్నారు. ఉద్యాన శాఖాధికారులు కూడా కొనుగోలు సంస్థలకే ప్రాధాన్యతనిస్తున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ ధర ప్రకారం రూ.700 ధర చెల్లించాలి. అప్పుడే రైతులు కోలుకుంటారు.

- కె.శ్రీనివాస్, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి

శాస్త్రవేత్తల సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు

ధర్మవరంలో వరి కమతాల సందర్శన



ధర్మవరంలో వరి పంటను పరిశీలిస్తున్న మార్టేరు వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు

కొవ్వూరు, మార్చి 18(ఆంధ్రజ్యోతి):రైతులు వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని రాజమహేంద్రవరం ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు అన్నారు. మంగళవారం ధర్మవరంలోని వ్యవసాయ క్షేత్రాలను మార్టేరు వ్యవసాయ పరిశోధనా కేంద్రం, రాజమహేంద్రవరం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు పరిశీలించారు. ప్రస్తుత దాళ్వా పరిస్థితి, చీడపీడల ఉధృతి వంటి వాటిపై అధ్యయనం చేశారు. చిరుసంచుల ప్రదర్శనలో భాగంగా సాగు చేస్తున్న ఎంటీయూ 1426, ఎన్ఎల్ఆర్ 3238 రకాల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా మార్టే రు వ్యవసాయ పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ గిరిజారాణి, ఏరువాక జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ నరసింహారావు మాట్లాడారు. కార్యక్రమంలో మార్టేరు శాస్త్రవేత్త డాక్టర్ వి. భువనేశ్వరి, కొవ్వూరు వ్యవసాయ సహాయ సంచాలకుడు పి. చంద్రశేఖర్, డీఆర్‌సీ ఏడీఏ ఎస్. జయరామలక్ష్మి, వ్యవసాయాధికారి ఎ. గంగాధర్, వీఏఏ జ్ఞానదాస్, వ్యవసాయ కళాశాల విద్యార్థులు జే. కార్తీక్‌కుమార్, జీ. లోకేష్, వీ. నితిన్, జీ. పవన్‌కుమార్ రెడ్డి, ఎన్. నవీన్, అభ్యుదయ రైతులు పిన్నేటి రమేష్, పీ. గోపాలకృష్ణ పాల్గొన్నారు.



రైతు సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతమనేని

అపరాల కొనుగోలు కేంద్రం ప్రారంభం

దెందులూరు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): దళారుల వ్యవస్థ లేకుండా రైతుల వద్ద మినుములు, పెసలు పంటలను చివరి ఆఖరి గింజ వరకు ప్రభుత్వమే మద్దతు ధరతో కొనుగోలు చేస్తుందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌రావు తెలిపారు. మంగళవారం దెందులూరు సహకార సంఘం బ్యాంకు కార్యాలయ ఆవరణలో మండల టీడీపీ అధ్యక్షుడు మాగంటి నారాయణ ప్రసాద్ (మిల్లుబాబు), క్లస్టర్ ఇన్‌చార్జి గారపాటి కొండయ్యచౌదరి, గ్రామ సర్పంచ్ తోట యేసమ్మ, జిల్లా వ్యవసాయశాఖ అధికారి షేక్ బాషా ఏడీ సుబ్బారావు, మార్క్‌ఫెడ్ అధికారి గుప్తాలతో కలిసి మినుము, పెసల కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన రైతు సదస్సులో చింతమనేని మాట్లాడుతూ పెసలకు క్వింటా రూ.8682 రూపాయలు, మినుములు క్వింటా రూ.7400 మద్దతు ధరతో ప్రభుత్వమే 12 తేమశాతంతో కొనుగోలు చేస్తుందని తెలిపారు. నగదు రైతుల బ్యాంకు ఖాతాలలో జమ చేస్తుందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి దామ వెంకటేశ్వరావు, టీడీపీ నాయకులు యిప్పిలి వెంకటేశ్వరావు, ఏపీ యాదవ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ మహేష్ యాదవ్, ఎంపీటీసీ శేషారత్నం, సంపంగి వేణుగోపాల తిలక్ పాల్గొన్నారు

వ్యవసాయ, ఉద్యాన అధికారులతో సమీక్ష

ఏలూరుసిటీ, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో మంగళవారం వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ అధికారులతో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీప్రసాద్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయా శాఖలలో నిర్వహిస్తున్న కార్యక్రమాలపై సమగ్రంగా చర్చించారు. ఈ సమీక్షలో ప్రధానంగా అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ పథకం అమలుపై చర్చిస్తూ జిల్లాలో అర్హులైన రైతులకు 20వేల రూపాయలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని అన్నారు. అర్హులైన ప్రతి రైతుకు లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అధికారులను ఆదేశించారు. వ్యవసాయ పనులను జాతీయ ఉపాధి హామీ పథకం కింద చేపట్టటం వల్ల రైతులకు లాభసాటిగా ఉందని అన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కార్తికేయశర్మ

విద్యార్థి ప్రతి అడుగు విజయం కోసం వేయాలి

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఎక్కడ ఉన్నా ఈ-పుస్తకాలు, ఈ- జర్నల్స్ ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని ఏపీ నిట్ గ్రంథాలయ చైర్మన్ టి.కార్తికేయశర్మ తెలిపారు. ఏపీ ఇన్‌చార్జ్ డైరెక్టర్ ఎన్‌వీ రమణరావు, రిజిస్ట్రార్ పి.దినేష్ శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిట్ ప్రాంగణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంట్రల్ లైబ్రరీలో నింబస్ రిమోట్ యాక్సస్ సాఫ్ట్‌వేర్‌పై ఆయన అధ్యక్షతన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్తికేయశర్మ మాట్లాడుతూ విద్యార్థులు వేసే ప్రతి అడుగు వారి విజయం కోసమే అన్నట్టుగా వారి దినచర్య ఉండాలన్నారు. అదే నిట్ లక్ష్యమని వివరించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ కాశీ అన్నపూర్ణ సిబ్బంది పాల్గొన్నారు.

ఇన్విజిలేటర్లకు పారితోషికం పెంచాలి

ఏలూరు అర్బన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : పదోతరగతి పరీక్షల నిర్వహణలో ఇన్విజిలేషన్ విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులకు చెల్లించే పారితోషకాన్ని పెంచాలని ఏపీ స్కూల్ టీచర్స్ అసోసియేషన్(ఏపీఎస్టీఏ) రాష్ట్ర సహ అధ్యక్షుడు స్టీవెన్, జిల్లా నాయకులు వెంకటరమణ, ప్రసాద్, శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. టెన్త్ పరీక్షలకు ఇన్విజిలేటర్లుగా పనిచేసినవారికి రోజుకు కేవలం రూ.33 మాత్రమే చెల్లిస్తున్నారని, ప్రస్తుత రోజుల్లో ఈ రెమ్యూనరేషన్ చాలా తక్కువని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ పరీక్షల విధులను నిర్వర్తిస్తున్న ఇన్విజిలేటర్లకు రోజువారీ రెమ్యూనరేషన్‌గా చెల్లిస్తున్న రూ.150లనే పదోతరగతి పరీక్షల ఇన్విజిలేటర్లకు కూడా ఇవ్వాలని కోరారు. అలాగే పరీక్ష కేంద్రాల సీఎస్‌లు, డీవోలు, కస్టోడియన్లు, సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలకు పారితోషకాన్ని పెంచాలని డిమాండ్ చేశారు. ఇంటర్‌బోర్డుకు కేటాయించిన విధంగానే ఎస్ఎస్‌సీ పరీక్షలకు బడ్జెట్ నిధుల కేటాయింపులు జరగాలని అభ్యర్థించారు.

పెనుమదంలో అమ్మవార్ల జాతర



పోడూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పెనుమదం శ్రీమహాలక్ష్మమ్మ, గంట్లమ్మ, ధనకొండ్లమ్మ, పోలేరమ్మ, చల్లాలమ్మ, గోగులమ్మ అమ్మవార్ల జాతర ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం రాత్రి జాతరను వైభవంగా నిర్వహించారు. సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి వేలాదిమంది భక్తులు విచ్చేసి జాతర తిలకించారు. అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కొళగార కమిటీ చెర్మన్ కర్రే రామచంద్రరావు, ఈవో పిల్లి సూర్యనారాయణ, దేవరపు దొర బాబు, తంగెళ్ల సత్యనారాయణ, కడలి ఆంజనేయులు, మాకా సాయి బాబు, సన్నిది బదరీనారాయణ, గ్రామపెద్దలు జాతర ఏర్పాట్లను పర్యవేక్షించారు.



రింగా.. టెండరా ?

» మాధవాయిపాలెం రేవుకు రికార్డు స్థాయిలో షెడ్యూల్ విక్రయాలు
» 21న పాట, 20 వరకు షెడ్యూల్ స్వీకరణ » పోటీ ఉంటే రూ.4 కోట్ల వరకు ఆదాయం » తెర వెనుక ఆదాయం గండికొట్టేందుకు యత్నాలు

నరసాపురం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వానికి రేవు పాటల ద్వారా అత్యధిక ఆదాయం వచ్చే వాటిలో మాధవాయిపాలెం రేవు ఒకటి. ఏటా పాట ద్వారా రూ.3.50 కోట్ల వరకు ఆదాయం వస్తోంది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రేవు పాట నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 21న నరసాపురం మండల పరిషత్ కార్యాలయంలో పాట జరగనుంది. ఇప్పటికే షెడ్యూల్ విక్రయాల గడువు ముగిసింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి పాటలో పాల్గొనేందుకు 15 షెడ్యూళ్లు విక్రయించారు. దీంతో అధికారులు ఈసారి పాటదారుల మధ్య గట్టి పోటీ ఉంటుందని భావిస్తున్నారు. ప్రారంభ ధర రూ.3.13 కోట్లుగా నిర్ణయించారు. ముందుగా బహిరంగ వేలం నిర్వహిస్తారు. ఇందులో ఎక్కువ మొత్తంలో పాడిన పాటదారుడికి మొదటి ప్రాధాన్యత ఇస్తారు. ఆ తరువాత సీల్డ్ టెండర్లు తెరుస్తారు. ఇందులో బహిరంగ వేలంకంటే ఎక్కువ మొత్తంలో కోడ్ చేసి ఉంటే ఆ పాటదారుడికి రేవును ఖరారు చేస్తారు. లేని పక్షంలో బహిరంగ వేలంలో ఎవరూ ఎక్కువ మొత్తంలో పాడుకుంటే వారికే పాట దక్కుతుంది. ఈసారి ఈ రెండు పద్ధతుల్లోనే పాటను నిర్వహిస్తుండటంతో గుత్తేదారుల మధ్య గట్టి పోటీ నెలకొనే అవకాశం ఉంది.

గతంలో రికార్డు స్థాయిలో ఆదాయం

2023-24 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వానికి రికార్డు స్థాయిలో రూ.3.66 కోట్ల ఆదాయం వచ్చింది. ఇదే ఆల్ టైం రికార్డు. గత ఏడాది ఏడు నెలలకే పాటను నిర్వహించారు. అందులో కూడా రూ.2.96 కోట్లకు పాడుకున్నారు. ఈసారి స్థానికులతోపాటు కాకినాడ, కోనసీమ జిల్లాల లోని టెక్కిశెట్టిపాలెం, పెదపట్నం, పోడూరు, ఆచంట, యలమంచిలి ప్రాంతాల నుంచి కొన్ని సొసైటీలు షెడ్యూల్‌లో కొనుగోలు చేశాయి. పాటలో పాల్గొవాలంటే డిపాజిట్ రూ.33 లక్షలు చెల్లించాలి. వారినే అనుమతిస్తారు. ఈ నేపథ్యంలో షెడ్యూల్ కొనుగోలు చేసిన పాటదారుల్లో ఎంత మంది డిపాజిట్ చెల్లించి పాటలో పాల్గొంటారన్నది చర్చనీయాంశమైంది. అయితే సొసైటీలకు డిపాజిట్ మినహాయింపు ఉంటుంది. ఈ కారణంగా ఎక్కువ మంది పాల్గొనే అవకాశం ఉంది. వీటితోపాటు చార్జీలు పెరిగాయి. గోదావరిలో దూరం కేవలం 200 మీటర్లు అయినప్పటికీ పంటు ఎక్కాలంటే రూ.20 జేబులో ఉండాలి. అదే బైక్ మీద అయితే రూ.35, కారుకు రూ.180, ఇలా ప్రతి వాహనానికి ఒక్కొక్క రేట్‌ను ఫిక్స్ చేశారు. ఈ కారణంగా రేవుకు ఆదాయం భారీగా వస్తుండటంతో పాటదారుల మధ్య పోటీ నెలకొంది.

సిండికేట్‌కు యత్నం

పాట జరగకుండా కొందరు రింగ్ మాస్టర్లు రాజీచేసే యత్నాలను తెరవెనుక ప్రయత్నాలు మొదలుపెట్టారన్న ఊహాగానాలు షికారు చేస్తున్నాయి. మనం.. మనం పోటీపడి ఆదాయం పెంచేకంటే.. ఒక నిర్ణయంతో టెండర్లు వేసుకోవాలన్న ప్రతిపాదన తీసుకొచ్చినట్లు సమాచారం. ఇదే జరిగితే ప్రభుత్వ ఆదాయానికి గండి పడే అవకాశం ఉంది. అధికారులు మాత్రం బయట ఏమి జరిగినా తమకు అనవసరమని ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే ఎక్కువ మొత్తంలో పాడుకుంటునే పాటను ఓకే చేస్తామని చెబుతున్నారు.

అక్రమార్కులెవరు?!

వైద్య ఆరోగ్య శాఖ నియామకాల ప్రక్రియపై పునఃపరిశీలన
ఆంధ్రజ్యోతి కథనంతో ఉమ్మడి పశ్చిమలో కలకలం



ఏలూరు అర్బన్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో కాంట్రాక్టు ల్యాబ్ టెక్నీషియన్లు, ఔట్‌సోర్సింగ్ ఫిమేల్ నర్సింగ్ ఆర్డరీ (ఎఫ్ఎన్‌వో) ఉద్యోగఖాళీల భర్తీప్రక్రియలో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయంటూ 'రూ.లక్షన్నర పెట్టు.. ఉద్యోగం పట్టు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో మంగళవారం ప్రచురితమైన కథనం పెను కలకలాన్నే సృష్టించింది. కథనంలోని అంశాలపై ఆరాతీసిన ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సంబంధిత నోటిఫికేషన్‌లో పేర్కొన్న ఉద్యోగ నియామకాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల విద్యార్హతల ధ్రువ పత్రాలను రీ వెరిఫికేషన్ చేయించే ప్రక్రియను డీఎంహెచ్‌వో కార్యాలయంలో ప్రారంభించారు. జిల్లాలోని ఆయా పీహెచ్‌సీల వైద్యాధికారులను పిలిపించి వారి నేతృత్వంలోనే ఉద్యోగార్థుల సర్టిఫికెట్లను, ఆయా పరీక్షల్లో వారు సాధించిన మార్కులు, దరఖా స్తులో చూపించిన మార్కుల శాతం, వాటికి డీఎంహెచ్‌వో కార్యాలయ సిబ్బంది కేటాయించిన మార్కుల శాతం, మెరిట్ జాబితాలో నమోదు, తదితర వివరాలను పునః పరిశీలన చేయించే ప్రక్రియను ప్రారంభించినట్టు డీఎంహెచ్‌వో డాక్టర్ మాలిని తెలిపారు. మొత్తం 3 వేలకు పైగా దరఖాస్తులను పునఃపరిశీలన చేయాల్సి ఉంటుందన్నారు. ముందుగా తొలి వంద దరఖాస్తులను రీవెరిఫికేషన్ చేయగా, కొందరు అభ్యర్థులకు ఆయా విద్యార్హతల సర్టిఫికెట్లలో నమోదైన మార్కులకు, దరఖాస్తులో నమోదైవున్న మార్కుల శాతానికి తేడాలున్నట్టు తేలిందని డీఎంహెచ్‌వో వెల్లడించారు. పునఃపరిశీలనలో గుర్తించిన కొందరు అభ్యర్థుల మార్కులశాతంలో తేడాలు తాజా నియామకాలను ప్రభావితం చేస్తాయా, లేదా అనేది తెలియరాలేదు. రీ వెరిఫికేషన్ ప్రక్రియ కోసం ప్రత్యేకంగా సిబ్బందిని నియమించడంతో పాటు, మార్కులశాతాన్ని లెక్క గట్టేందుకు అవసరమైన కాలిక్యులేటర్లను సమకూర్చామని వివరించారు. విద్యార్హత సర్టిఫికెట్ల జెన్యూనెస్, అభ్యర్థులు నమోదుచేసిన మార్కులు, దరఖాస్తుల్లో పేర్కొన్న మార్కుల శాతం వంటివి నిగ్గు తేల్చేందుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం తమ వద్ద లేదని, దీనికోసం విద్యా శాఖను సంప్రదించాల్సి ఉందని డీఎంహెచ్‌వో తెలిపారు. దీనికోసం ఎస్ఎస్‌సీ బోర్డులో ప్రత్యేక విభాగం ఉంటుందన్నారు. అవసరమైతే సర్టిఫికెట్ల వెరిఫికేషన్, జెన్యూనెస్ కోసం జిల్లావిద్యాశాఖ సహకారాన్ని తీసుకునేందుకు కలెక్టర్ అనుమతికోసం అభ్యర్థిస్తామని వివరిం చారు.

వాస్తవానికి గతంలో జిల్లావైద్య ఆరోగ్య శాఖలో చేపట్టిన వివిధ ఉద్యోగ ఖాళీల భర్తీకి అభ్యర్థులకు డీఎంహెచ్‌వో కార్యాలయ ఉద్యోగులు రూపొందించిన మెరిట్ కం రోస్టర్ జాబితాలను జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయులు, విద్యా శాఖ సిబ్బందితో కూడిన బృందాలతో థర్డ్ పార్టీ వెరిఫికేషన్ చేయించే విధానాన్ని కలెక్టర్లు పారదర్శకత నిమిత్తం అమలుచేసేవారు. కాలక్రమంలో కలెక్టర్లు మారిపోతుండటంతో ఈ విషయాన్ని డీఎంహెచ్‌వో కార్యాలయంలో కీలకంగా వ్యవహరించే ఉద్యోగులే తెరమరుగు చేశారనే విమర్శలు తాజాగా తెరపైకి రావడం గమనార్హం. ఉద్యోగ నియామకాల్లో కొందరు వ్యక్తులు డీఎంహెచ్‌వో కార్యాలయంలోని కొందరు ఉద్యోగులను ప్రలోభాలకు గురిచేసి డబ్బులిచ్చిన అభ్యర్థులకు లబ్ధిచేకూర్చేలా వ్యవహరిస్తున్నారంటూ ఓ వ్యక్తి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాస్పందనలో ఫిర్యాదు అందజేసిన విషయం విదితమే.

23న ఏఎన్‌యూ దూరవిద్య ప్రవేశ పరీక్ష

పెదకాకాని, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విద్యాలయం దూరవిద్య కేంద్రం ఆధ్వర్యంలో 2025 విద్యా సంవత్సరానికి గాను రెండేళ్ల మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (ఎంబీఏ), మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ (ఎంసీఏ) కోర్సులలో ప్రవేశ పరీక్ష షెడ్యూల్ విడుదల చేసినట్లు దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వంకాయలపాటి వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. ఈ నెల 23వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా 7 పరీక్ష కేంద్రాలలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు ప్రవేశ పరీక్ష జరుగుతుందని చెప్పారు. ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేయని అభ్యర్థులు నేరుగా పదో తరగతి, డిగ్రీ ప్రొవిజినల్, మార్కుల జాబితా, ఫొటోతో పాటు సాధారణ ఫీజు రూ.500 చెల్లించి, పరీక్షకు నేరుగా హాజరు కావచ్చని తెలిపారు. కాగా.. ఏపీ ఐసెట్ 2024లో అర్హత సాధించిన అభ్యర్థులు నేరుగా ఈ కోర్సుల్లో అడ్మిషన్లు పొందవచ్చు.

వైస్ చైర్మన్‌ను అంటూ డబ్బు డిమాండ్

కామవరపుకోట, మార్చి 18: కామవరపుకోటకు చెందిన పూరికర్ణం జగన్నాథరావు ఈ నెల 17వ తేదీ రాత్రి సీఎంవో స్టిక్కరు కలిగిన కారులో స్థానిక విశ్వతేజ ప్రిన్సిపాల్ గుడెల్లి వాసు వద్దకు వచ్చి తాను సీఎంవో వైస్ చైర్మన్‌ను అని చెప్పి మీ పాఠశాల గుర్తింపు రద్దు చేయకుండా ఉండాలంటే రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండు చేశాడు. ప్రిన్సిపాల్ పోలీసులను ఆశ్రయించాడు. జగన్నాథరావును అదుపులోకి తీసుకుని కారును స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్.ఐ పి.చెన్నారావు తెలిపారు.

ఇళ్లల్లో దోచి.. శ్మశానాల్లో దాచి..

అంతర్‌రాష్ట్ర వెరైటీ దొంగ సురేందర్ అరెస్టు » రూ.45 లక్షల విలువైన సొత్తు స్వాధీనం » ఏపీ, తెలంగాణల్లో 90 చోరీ కేసుల్లో నిందితుడు » పారిపోయే క్రమంలో సత్తుపల్లిలో కానిస్టేబుల్‌పై దాడి » వలపన్ని పట్టుకున్న పోలీసులు



రికవరీ చేసిన చోరీ సొత్తును చూపిస్తున్న ఖమ్మం సీపీ సునీల్‌దత్

సత్తుపల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో 90 చోరీ కేసుల్లో నిందితుడిగా ఉన్న తిరువీధుల సురేందర్‌ను మంగళవారం సత్తుపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. సురేందర్ ఈనెల 10వ తేదీన సత్తుపల్లిలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా కానిస్టేబుల్ నరేష్ గమనించి అనుసరించాడు. దీంతో సురేందర్ కత్తితో నరేష్‌పై దాడిచేసి పరారయ్యాడు. అప్పటినుంచి అతడి ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తూ మంగళవారం ఎట్టకేలకు పట్టుకున్నారు. సురేందర్ ఏలూరు జిల్లా చాట్రాయి మండలం చిత్తాపూర్ వాసి. గత నవంబర్‌లో రాజమండ్రి జైలు నుంచి విడుదలైన తర్వాత సురేందర్ తెలుగు రాష్ట్రాలలో తిరిగి చోరీలు చేయడం మొదలుపెట్టాడు. తెలంగాణలోని ఖమ్మం, కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, సూర్యాపేట, నల్లగొండ జిల్లాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో 3 నెలల కాలంలో 43 కేసులలో నిందితుడిగా ఉన్నాడు. సురేందర్ గూగుల్ మ్యాప్ ద్వారా ఇళ్లను గుర్తించి చోరీలకు పాల్పడుతుంటాడు. చోరీ అనంతరం శ్మశాన వాటికల్లో షెల్టర్ తీసుకోవడంతో పాటు చోరీ సొత్తుకూడా శ్మశానాల్లోనే దాచిపెడతాడు. మంగళవారం అందిన సమాచారం మేరకు సత్తుపల్లి మండలం కొత్తూరు సమీపంలోని శ్మశాన వాటిక వద్ద సురేందర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి 461.18 గ్రాముల బంగారు, 426 గ్రాముల వెండి, రూ.3.33లక్షల నగదు, మొబైల్ ఫోన్, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.45 లక్షలు ఉంటుంది.

మొదటిసారిగా తల్లికి చీర కొనడానికి చోరీ

సురేందర్ నుంచి మారణాయుధాలు స్వాధీనం చేసుకుని అతన్ని అరెస్ట్ చేసి హత్యాయత్నం, చోరీ కేసులు నమోదు చేసి రిమాండ్ చేసినట్లు కమిషనర్ తెలిపారు. సురేందర్ తన తల్లికి చీర కొనివ్వాలనే కోరికతో మొట్ట మొదటి సారి రూ.300 చోరీ చేసి చీర కొనుగోలు చేశాడని, అప్పటి నుంచి చోరీలు కొనసాగిస్తూ అంతర్‌రాష్ట్ర దొంగగా మారాడని వివరించారు.

పోలీసులకు రివార్డులు

సురేందర్ ఆచూకీ కనుగొనే క్రమంలో తీవ్రంగా గాయపడిన కానిస్టేబుల్ నరేష్‌తో పాటు అతడిని ఆసుపత్రికి తరలించిన పౌరులు ఇల్లంగి రాజు, చెరుకుపల్లి ప్రసాద్‌లను కమిషనర్ ప్రత్యేకంగా అభినందించి నగదు రివార్డు అందజేశారు.

తాటియాకులగూడెంలో వ్యక్తిపై హత్యాయత్నం

రంగంలోకి క్లూస్, డాగ్ స్క్వాడ్‌లు



జీలుగుమిల్లి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): తాటియాకులగూడెంలో ఒక వ్యక్తిపై గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం వేకువ జామున హత్యాయత్నం చేశారు. ఈ దాడిలో గ్రామానికి చెందిన గందం బోసు తలకు తీవ్రగాయం అయ్యింది. అతడిని కుటుంబ సభ్యులు ఖమ్మం ఆస్పత్రికి తరలించగా కోమాలోకి వెళ్లినట్లు వైద్యులు తెలిపారన్నారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. గ్రామానికి చెందిన గందం బోసు గతంలో ఉపాధి హామి ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేసి సస్పెండ్ అయ్యాడు. మంగళవారం ఉదయం స్థానికులు అతడిపై హత్యయత్నం జరిగింది. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు విచారణ జరుపుతున్నారు. క్లూస్ టీం, డాగ్‌స్క్వాడ్ పరిసర ప్రాంతాల్ని పరిశీలించాయి. బాధితుడికి ఎవరైనా శత్రువులు ఉన్నారా, అతడిపై హత్యాయత్నానికి ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా, కుటుంబ నేపథ్యం వంటి అంశాలపై పోలీసుల విచారణ కొనసాగుతున్నది.

నకిలీ నోట్ల కలకలం

వేలేరుపాడులో వ్యాపారులు, ప్రజల ఆందోళన



నకిలీ నోట్లు

వేలేరుపాడు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): వేలేరుపాడులో నకిలీనోట్లు కలకలం రేగుతున్నది. అసలు నోట్లను పోలిన రూ.500 నకిలీ నోట్లు చలామణిలో ఉన్నాయి. రూ.500 నకిలీనోట్లు ఐదు బహిర్గతం కావడంతో ఈ విషయం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. వేలేరుపాడులోని ఒక మహిళకు రేపాకగొమ్ము గ్రామానికి చెందిన ఒక యువకుడు బాకీ కింద ఐదు రూ.500నోట్లు ఇవ్వగా వాటిని చిల్లరగా మార్చుకునే క్రమంలో స్థానిక బ్రాందీషాపు వద్దకు వెళ్ళగా అక్కడ వాటిని పరీక్షించగా నకిలీనోట్లని తేలింది. దీనిపై బ్రాందీషాపు నిర్వాహకులు ఈ నోట్లు ఎవరు ఇచ్చారని సదరు మహిళను ప్రశ్నించారు. అప్పటికే అక్కడ ఉన్న మందుబాబులకు ఈ విషయం తెలియడంతో మండల వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. నకిలీనోట్లు ఇచ్చిన సదరు యువకుడి వ్యవహార శైలిపైన పలు అనుమనాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో ఎన్నడులేని విధంగా రూ.500 నోట్ల కట్టలను జేబులో పెట్టుకుని విచ్చలవిడిగా ఖర్చులు చేయడం చూస్తుంటే మరెవరినుంచైన నకిలీనోట్లు ఈ యువకుడి ద్వారా చలామణి అవుతున్నాయా అని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భద్రాచలంలో ఉండే ఈ యువకుడి బంధువు వ్యవహారశైలి కూడా అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. అనతికాలంలోనే ధనవంతుడు అవడం కూడా అనుమానాలకు ఊతం కల్పిస్తుంది. మరొక అనుమానం కూడా ప్రజల నుంచి వ్యక్తమవుతుంది. ఈ ప్రాంతంలో రైతుల వద్ద నుంచి బయట ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారులు పెద్దఎత్తున మిర్చిని కొనుగోలు చేస్తున్నారు. వీరు కూడా రైతులకు నగదు రూపంలోనే చెల్లింపులు చేస్తున్నారు. వీరి ద్వారా ఏమైన నకిలీనోట్లు చలామణి అవుతున్నాయా అనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. నకిలీనోట్లు బయటపడటంతో స్థానిక వ్యాపారుల్లోనూ రైతుల్లోనూ తీవ్ర ఆందోళన నెలకొంది. 500 నోటును చూస్తేనే తీసుకోవడానికి వెనకాడుతున్నారు.

షాపులో చోరీ

ఏలూరు క్రైం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): చలువ కళ్ళజోళ్లు, టోపీలు, ఇతర చున్నీలు, ఇతర వస్తువులు విక్రయించే షాపు తాళాలు పగులగొట్టి దొంగలు లూటీ చేశారు. ఏలూరు మినీ బైపాస్ రోడ్డులో నాదెండ్ల రేవంత్ చలువ కళ్ళజోళ్లు, టోపీలు ఇతర వస్తువుల షాపును నిర్వహిస్తున్నాడు. యథావిధిగా సోమవారం రాత్రి షాపుకు తాళాలు వేసి మంగళవారం ఉదయం వచ్చేటప్పటికి షాపు బద్దలుకొట్టేసి ఉంది. షాపులోని 50 వేల రూపాయల విలువైన వస్తువులు మొత్తం అపహరించుకుపోయాడు. బాధితుడు ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళకు వేధింపులు

ఉండి, మార్చి 18(ఆంధ్రజ్యోతి):వేధింపుల కేసుకు సంబంధించి ఇరువురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహ్మద్ నజీరుల్లా తెలిపారు. ఎన్ఆర్‌పిఅగ్రహారంనకు చెందిన మహిళను ఇద్దరు వ్యక్తులు ప్రేమ పేరుతో తరుచూ వేధిస్తున్నారు. దీనితో బాధిత మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఉండి ఎస్ఐ నజీరుల్లా తెలిపారు.

ఆర్టీసీ మాజీ ఉద్యోగి ఆత్మహత్య

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం పట్టణంలో ఆర్టీసీ మాజీ ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం చోటుచేసుకున్నది. పట్టణంలోని గంటా ఆంజనేయ దుర్గా ప్రసాద్(45) ఇంటి వద్ద ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దుర్గా ప్రసాద్ చేతి మణికట్టు కోసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. వీటితోపాటు ఘటనా స్థలంలో పురుగు మందు డబ్బా ఉండటం మరిన్ని అనుమానాలకు తావిస్తోంది. పట్టణ ఎస్ఐ నాగరాజు పరిశీలించారు. భీమవరం ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేసే దుర్గా ప్రసాద్ మద్యానికి బానిసై మద్యం సేవిస్తూ విధులకు హాజరవుతూ ఉండగా సస్పెండ్ చేశారు. ఇటీవల ఫిట్‌నెస్ పరీక్షకు వెళ్లగా కంటిచూపు సరిగా లేదని తేలడంతో విధుల్లోకి తీసుకోలేదు. మనస్థాపానికి చెంది ఆత్మహత్యకు పాల్పడ్డట్టు బావిస్తున్నారు. దుర్గా ప్రసాద్‌కు భార్య, కుమార్తె ఉన్నారు. కుమార్తెకు వివాహం చేశారు.

రేపటి నుంచి నూకాలమ్మ జాతర ప్రారంభం

ఏలూరుకార్పొరేషన్, మార్చి 18(ఆంధ్రజ్యోతి) : కొత్తపేటలోని నూకాలమ్మ ఆలయం వద్ద ఈ నెల 20 నుంచి 28వ తేదీ వరకు జాతరను నిర్వహించనున్నారు. కొత్త అమావాస్య సందర్భంగా జాతరను ప్రారంభిస్తున్నట్టు ఉత్సవ కమిటీ ఛైర్మన్ దావల రంగ సత్యనారాయణ, దొంతా సూర్య నారాయణలు తెలిపారు. ప్రారంభోత్సవానికి ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటికి ఆహ్వాన పత్రికను ఉత్సవ కమిటీ నిర్వాహకులు మంగళవారం అందజేశారు.

సారా నిర్మూలనపై అవగాహన సదస్సులు

జంగారెడ్డిగూడెం, మార్చి 18(ఆంధ్రజ్యోతి) : సారా ప్రభావిత ప్రాంతాలైన పంగిడిగూడెం, లక్కవరం, దేవులపల్లి, పుట్లగట్లగూడెం గ్రామాల్లో మంగళవారం ఎక్సైజ్ సీఐ కె.శ్రీనుబాబు ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా సారా వల్ల కలిగే అనర్థాలను వివరించారు. అనంతరం సర్పంచ్‌లు, వీఆర్వో, వీఆర్‌ఏలతో గ్రామ కమిటీలను ఏర్పాటు చేశారు. నవోదయం 2.0లో భాగంగా ప్రచార రథతో ప్రజలకు సారా నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్నామని సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ పోలీసులు పాల్గొన్నారు.

వట్లూరు ఎంపీపీ పాఠశాల ఆకస్మిక తనిఖీ

పెదపాడు, మార్చి 18(ఆంధ్రజ్యోతి) :ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపర్చి, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. పెదపాడు మండలం వట్లూరు ఎంపీపీ పాఠశాలను మంగళవారం అకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని విద్యార్థులతో కొంతసేపు మమేకమై విద్యాబోధన, విషయ పరిజ్ఞానంపై ఆరా తీశారు. పిల్లలతో కలిసి కూర్చొని పాఠ్యపుస్తకాల్లోని అంశాలను వారితో చదివించి, వారిని అభినందించారు. పాఠశాలలో సౌకర్యాలు, మధ్యాహ్న భోజనం గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్డీవో అచ్యుత్ అంబరీష్, ఎంపీడీవో అమీలు జమ, ఎంఈవో సబ్బితి నరసింహామూర్తి, ఉపాధ్యాయులు జి.వి.రంగమోహన్, వి.సావిత్రిలు పాల్గొన్నారు.

చిన్నారుల ఆధార్ నమోదుకు ప్రత్యేక శిబిరాలు

పెదవేగి, మార్చి 18(ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదై, ఇప్పటి వరకు ఆధార్ నమోదు కాని ఆరేళ్లలోపు పిల్లలకు కొత్తగా ఆధార్ నమోదు శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామని పెదవేగి ఎంపీడీవో పి.శ్రీనివాస్ తెలిపారు. బుధవారం నుంచి 27వ తేదీ వరకు ఎంపిక చేసిన గ్రామాల్లో ఆధార్ నమోదుకు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తామన్నారు. 19, 20 తేదీల్లో బాపిరాజుగూడెం, వంగూరు, లక్ష్మీపురం, 21,22 తేదీల్లో పెదకడిమి, ముందూరు, కొండలరావుపాలెం గ్రామాల్లో శిబిరాలు ఉంటాయన్నారు. 25, 26 తేదీల్లో కవ్వగుంట, చక్రాయగూడెం, జగన్నాథపురం, 27, 28 తేదీల్లో కొప్పాక, న్యాయంపల్లి, దుగ్గిరాల గ్రామాల్లో నిర్వహిస్తామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు తప్పనిసరిగా ఆధార్ నమోదు చేయించుకోవాలని సూచించారు. దీంతో పాటు మొబైల్ శిబిరాల నిర్వహణకు కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ఆదేశించారు.

విద్యుత్ మీటర్ల రీడర్ల సమస్యలు పరిష్కరించాలి

జంగారెడ్డిగూడెం, మార్చి 18(ఆంధ్రజ్యోతి) :విద్యుత్ మీటర్ల రీడర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు విద్యుత్ శాఖ ఈఈ పీర్ అహ్మద్ ఖాన్‌కు వినతి పత్రం అందజేశారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు మాట్లాడుతూ ఇప్పటికే అనేక సార్లు విద్యుత్ మీటర్ రీడర్ల ఉద్యోగ భద్రత గురించి రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు. విద్యుత్ మీటర్ల స్థానంలో స్మార్ట్ మీటర్లు అమరుస్తున్నారని దీంతో ఇప్పటి వరకు ఉన్న విద్యుత్‌మీటర్ రీడర్లు రోడ్డున పడే అవకాశం ఉందని, వారి పక్షాన ఏఐటీయూసీ పోరాడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి కూనపాముల విఘ్నేష్, మీటర్ రీడర్స్ యూనియన్ నాయకులు కె.మల్లేశ్వరరావు, ఎం.నాగేశ్వరరావు, కె.శ్రీనివాసరావు, ఆయా మండలాల నాయకులు పాల్గొన్నారు.

మున్సిపల్ కాంట్రాక్టర్ల సమస్యలు పరిష్కరించండి

జంగారెడ్డిగూడెం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): బిల్లుల విషయంలో మున్సిపల్ కాంట్రాక్టర్ల సమస్యలను పరిష్కరించాలని పలువురు కాంట్రాక్టర్లు అధికారులను కోరారు. జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు చేసిన బిల్లులకు చెందిన డిపాజిట్లు తిరిగి ఇప్పించాలని కోరారు. ఈ మేరకు లయన్స్ క్లబ్ భవనంలో మంగళవారం మున్సిపల్ కాంట్రాక్టర్ల అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశానికి ముందుగా బుట్టాయగూడేనికి చెందిన కాంట్రాక్టర్ శివయ్య బాబు గత మూడు రోజుల క్రితం మృతి చెందడంతో కాంట్రాక్టర్ల అసోసియేషన్ తరఫున సంతాపం తెలియజేశారు. అనంతరం పలు విషయాలపై తీర్మానాలు చేశారు. ఈ సమావేశంలో ఎం.వి.కె.ప్రసాద్, కె.షణ్ముఖరావు, ఎం.నాగేశ్వరరావు, కొండ్రెడ్డి కిషోర్, సూర్యప్రకాశ్ పాల్గొన్నారు.

నిధుల మంజూరు కోసం శాప్ ఛైర్మన్‌కు వినతి

జంగారెడ్డిగూడెం, మార్చి 18(ఆంధ్రజ్యోతి) : కరాటం శ్రీ కృష్ణమూర్తి ఎర్రకాలువ జలాశయం వద్ద వాటర్ స్పోర్ట్స్ అకాడమీ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని శాప్ ఛైర్మన్ రవినాయుడును టీడీపీ మండలాధ్యక్షుడు, చక్రదేవరపల్లి సర్పంచ్ సాయిల సత్యనారాయణలు మంగళవారం కలిసి వినతి పత్రం అందజేశారు. 2018లో టీడీపీ ప్రభుత్వ హయాంలో చాలా వరకు భవన నిర్మాణ పనులు జరిగాయని తెలిపారు. వారి వినతి మేరకు శాప్ ఛైర్మన్‌కు వివరించగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా శాప్ ఛైర్మన్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గన్నిన సురేంద్రనాథ్ చౌదరి, రవి, కొరారి ప్రసాద్, బలుసు కిరణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పీసా చట్టంపై అవగాహన కలిగి ఉండాలి

బుట్టాయగూడెం, మార్చి 18(ఆంధ్రజ్యోతి):పీసా చట్టంపై అవగాహన కలిగి ఉండాలని ఏపీఎస్ఐఆర్డీ డిప్యూటీ డైరెక్టర్ జె.రామనాథం అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో జరుగుతున్న పీసా చట్టం శిక్షణ తరగతుల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామ సభలకు కొత్తగా ఎన్నికైన ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, ప్రజా ప్రతినిధులు, స్వయం సహాయ సంఘాల లీడర్లు, సచివాలయ సిబ్బంది, మండల స్థాయి అధికారులు పీసా చట్టంపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎస్సీఆర్డీ జేడీ రమణ, ఎన్ఐఆర్‌టి శ్రీను, ఎంపీడీవో కె.జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 127 మంది విద్యార్థుల ఎంపిక

పెదపాడు, మార్చి 18(ఆంధ్రజ్యోతి) :వట్లూరులోని సర్ సీఆర్‌రెడ్డి మహిళా కళాశాలలో కెరీర్ గైడెన్స్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో జరిగిన ప్రాంగణ ఎంపికల్లో వివిధ కంపెనీల్లో 127 మంది విద్యార్థినులు ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ జి.సరళ తెలిపారు. ప్రాంగణ ఎంపికల్లో 539 మంది విద్యార్థినులు పాల్గొన్నారని తెలిపారు. ప్రాంగణ ఇంటర్వ్యూల్లో ఎంపికైన విద్యార్థినులను కరస్పాండెంట్ విశ్వనాథరావు అభినందించారు. కార్యక్రమంలో ఐక్యూ కో-ఆర్డినేటర్ ఝాన్సీ లక్ష్మి, జి.ఎస్.ఆర్.కల్యాణి, తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బ నివారణా జాగ్రత్తలపై అవగాహన

ఏలూరు అర్బన్, మార్చి 18(ఆంధ్రజ్యోతి) : వేసవిలో వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఏలూరు సత్రంపాడు అర్బన్ పీహెచ్‌సీలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ దీప్తి మాట్లాడుతూ అధికవేడిమి కారణంగా శరీరంలో ఉండే నీరు చెమటరూపంలో బయటకుపోయి వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. ఈ కారణంగా వాంతులు, ఆయాసం, నీరసం, ఫిట్స్ లక్షణాలు సంభవిస్తాయన్నారు. మధ్యాహ్నం 12 గంటల్లోగా పనులు ముగించుకోవడం, సాయంత్రం 4 గంటల తర్వాతే బయటకు వెళ్లడం శ్రేయస్కరమన్నారు. అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు మాట్లాడుతూ ద్రవ పదార్థాలైన కొబ్బరిబొండాలు, మజ్జిగ, ఓఆర్ఎస్ ద్రావణం, మంచినీరు తీసుకోవడం, లేతరంగు కాటన్ దుస్తులు ధరించడం, తలకు టోపీ, గొడుగు ఉపయోగించడం ద్వారా వడదెబ్బ నుంచి ఉపశమనం లభిస్తుందన్నారు. ఈ సందర్భంగా బోదవ్యాధితో బాధపడుతున్న 10 మంది ఫైలేరియా వ్యాధి గ్రస్తులకు బోదకాలును శుభ్రపరుచుకునేందుకు ప్రభుత్వం పంపిణీ చేసిన కిట్లు అందజేశారు.వైద్యసిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సోము వీర్రాజుకు గారపాటి చౌదరి సత్కారం

ఏలూరురూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర శాసన మండలి ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు సోము వీర్రాజును పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయచౌదరి మంగళవారం కలిసి సత్కరించారు. విజయవాడలోని ఆయన నివాసంలో సోమువీర్రాజును కలిసి పూల శాలువాతో ఘనంగా సత్కరించారు. క్రమశిక్షణ, నిబద్ధతతో నమ్మిన సిద్ధాంతం కోసం దశాబ్దాలపాటు కట్టుబడి ఉండటం వల్లే సోము వీర్రాజుకు రెండోసారి ఎమ్మెల్సీ పదవి దక్కిందని గారపాటి పేర్కొన్నారు.

ఎన్నికల నియమావళిపై నేడు సమావేశం

బుట్టాయగూడెం, మార్చి 18(ఆంధ్రజ్యోతి) : ఎన్నికల నియమావళికి సంబంధించి మండలంలోని అన్ని రాజకీయ పార్టీలకు అవగాహన కల్పించనున్నట్టు తహసీల్దార్ పి.వి.చలపతి రావు తెలిపారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి అన్ని పార్టీలకు చెందిన నాయకులు తప్పకుండా హాజరు కావాలని ఆయన కోరారు.

రెండో రోజుకు చేరిన ప్రజా చైతన్య యాత్ర

బుట్టాయగూడెం, మార్చి 18(ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలను పరిష్కరించాలని, ఎన్నికల హామీలను అమలు చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా చైతన్య యాత్ర రెండవ రోజు పి.ఆర్.గూడెం, కె.ఆర్.పురం, ఎస్.ఆర్.పాలెం, అచ్చియ్యపాలెం, మంగయ్యపాలెం, నిమ్మలగూడెం రామన్నగూడెం గ్రామాలతో పాటు పునరావాస కాలనీల్లో కొనసాగింది. అటవీ పోడు భూములకు హక్కులు కల్పించాలని, గ్రామాలు, పునరావాస కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కారం భాస్కర్, పోలోజు నాగేశ్వరరావు, చంద్రు బుల్లెమ్మ, కె.భీమరాజు, ఎస్.సాయికృష్ణ, శివలక్ష్మి పాల్గొన్నారు.

నిప్పంటుకుంటే బూడిదే..

గ్రామాల్లో వేసవి భయం - తాటాకిళ్ల యజమానుల్లో కలవరం - అగ్నిమాపక కేంద్రం కావాలని విజ్ఞప్తి

వేలేరుపాడు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): వేసవిని తలుచుకుంటేనే వేలేరుపాడు మండలంలోని గిరిజన గ్రామాలు గుండెల్లో వణుకు పుడుతోంది. ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదాలు జరిగితే క్షణాల్లో చూస్తుండగానే ఆస్తులు కాలి బూడిదవుతున్నాయి. గత కొన్నేళ్లుగా వేలేరుపాడు మండలంలోని గ్రామాల్లో జరిగిన అగ్నిప్రమాదాలను గమనిస్తే సర్వస్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలినవారే ఎక్కువ. ఇప్పటికి కూడా కోలుకోలేని పరిస్థితుల్లో కూలిపనులు చేసుకుంటూ కాలం వెళ్ళదీస్తున్నారు. మండలంలో అత్యధికంగా గిరిజన గ్రామాలే ఉన్నాయి. ఈ గ్రామాల్లో నివసిస్తున్న గిరిజనులు అత్యధిక శాతం కట్టెల పొయ్యలమీదే వంటావార్పు చేసుకుంటారు. ఏ మాత్రం అశ్రద్ధగా ఉన్నా మంటలు అంటుకుని సర్వం కోల్పోవాల్సి వస్తోంది. కన్నేళ్లక్రితం కటుకూరు గ్రామంలో ఒక ఇంట్లో చెలరేగిన మంటల కారణంగా గ్రామంలోని 42 ఇళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ప్రమాదంలో బాధితులకు కట్టుకున్న బట్టలుతప్ప మరేమి మిగల్లేదు. ఆ తరువాత కన్నాయిగుట్ట గ్రామంలో జరిగిన అగ్నిప్రమాదంలో 22 పూరిళ్లు కాలిబూడిదయ్యాయి. అడపాదడపా మండలంలో ఏదో ఒక మూల అగ్నిప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. అయితే బాధితులకు కొద్దిపాటి నిత్యావసర సరుకులిచ్చి గృహాలు కేటాయించడాన్ని పూర్తిగా పక్కనపెట్టేశారు.సర్వం కోల్పోయిన బాధితులకు కనీస సాయం చేసిన పాపన పోలేదు. కటుకూరు, కన్నాయిగుట్ట గ్రామాల్లోని బాధితులకు దాతలిచ్చిన టార్పలిన్ పట్టాల్లో తలదాచుకున్న పరిస్థితులున్నాయి.

అగ్నిమాపక యంత్రాలు లేకపోవడమే...

ప్రమాదం జరిగిన సమయంలో అగ్నిమాపక శకటానికి సమాచారమిచ్చిన వారు కుక్కునూరు నుంచి బయల్దేరి వచ్చే సరికే బూడిదే మిగులుతోంది. ఈ మండలంలోని గిరిజన గ్రామాల్లో అత్యధికంగా తాటాకులతో కప్పిన పూరిళ్లే ఉంటాయి. అగ్ని ప్రమాదం సంభవిస్తే క్షణాల్లో మంటలు చుట్టుపక్కలకు వ్యాపించి పదుల సంఖ్యలో గృహాలు దగ్ధమవుతున్నాయి. కుక్కునూరు, వేలేరుపాడు రెండు మండలాలకు కలిపి ఒకేఒక అగ్నిమాపక శకటం కుక్కునూరులో ఏర్పాటు చేశారు. దూరాభారం కావడంతో అక్కడి నుంచి వచ్చేలోపే జరగాల్సిన నష్టం జరిగిపోతోంది. ఈ వేసవిలో కనీసం మూడు నెలల పాటైన ఒక అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే ఎంతో మేలు జరుగుతుందని గ్రామీణ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.



కన్నాయిగుట్టలో పూర్తిగా దగ్ధమైన పూరిళ్లు(ఫైల్)



తెగుళ్ల నివారణపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రెండు గ్రామాల్లో పొలం పిలుస్తోంది

పెదపాడు, మార్చి 18(ఆంధ్రజ్యోతి) : కలపర్రు, సకలకొత్తపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించి పంటలు, చీడపీల నివారణపై అవగాహన కల్పించినట్టు మండల వ్యవసాయాధికారి వి.ప్రదీప్ కుమార్ తెలిపారు. అపరాల కొనుగోలు కోసం పెదపాడు, అప్పనవీడు, వట్లూరు సొసైటీల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియలో రైతులంతా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో లావేటి హేమసుందర్, రంభా నాగరాజు, తలగల రామకృష్ణ, గజ్జెల మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఒడిదుడుకులను ఎదుర్కోవాలి : నన్నయ వర్సిటీ రిజిస్ట్రార్



మాట్లాడుతున్న ప్రొఫెసర్ సుధాకర్

ఏలూరు అర్బన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : నిర్దేశించుకున్న జీవిత లక్ష్యాన్ని చేరుకునే క్రమంలో వచ్చే ఒడిదుడుకులను ధైర్యంతో, నేర్పుతో ఎదుర్కోవాలని విద్యార్థినులకు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సుధాకర్ సూచించారు. ఏలూరు సెయింట్ థెరిస్సా మహిళా కళాశాలలో డిగ్రీ చివరి సంవత్సరం పూర్తచేసి, ఇంటెర్న్‌షిప్ ముగించుకోనున్న విద్యార్థినులకు, కళాశాల విద్యార్థి సంఘ కార్యవర్గానికి వీడ్కోలు కార్యక్రమం మంగళవారం ఆడిటోరియంలో జరిగింది. ప్రొఫెసర్ సుధాకర్ మాట్లాడుతూ అధ్యాపకుల సహకారంతో విద్యార్థినులు పరిశోధనా రంగంలో ముందుకు వెళ్లాలని సూచించారు. కళాశాల సుపీరియర్, కరస్పాండెంట్ ఫెర్నాండెజ్ మాట్లాడుతూ కళాశాల జీవితం విద్యార్థినులకు ఒక శిక్షణ వంటిదన్నారు. వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన వారికి పురస్కారాలను అందజేశారు.ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ మాట్లాడుతూ డిగ్రీ పూర్తి చేసుకుని బయటకు వెళ్లున్న విద్యార్థినుల్లో సుమారు 100 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు అర్హత సాధించారని వివరించారు. వైస్‌ప్రిన్సిపాల్ సిస్టర్ మరియా క్రిస్టియానా, ఇంటర్మీడియట్ కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ ఫాతిమా డిగాల్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ సిస్టర్ సుశీల, వివిధ విభాగాల హెచ్‌వోడీలు, అధ్యాపకులు గోపీనాథ్, శ్రావణి, పూజిత, దుర్గాదేవి, జ్యోతి, విద్యార్థి సంఘ కార్యదర్శులు లక్ష్మీప్రసన్న, జ్ఞానిజైన్ పాల్గొన్నారు.

ముగిసిన అమ్మవార్ల ఉత్సవాలు

బుట్టాయగూడెం, మార్చి 18(ఆంధ్రజ్యోతి) : రెడ్డిగణపవరంలో కొలువైన కనకదుర్గమ్మ, అన్నపూర్ణ, విశ్వేశ్వర స్వామి ఆలయ శతాబ్ది ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని దాతలు గద్దె లక్ష్మణరావు, పెద్ద ఏసు, గద్దె సోమేశ్వరరావు ఆర్థిక సహకారంతో ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అన్నసమారాధనలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు భౌమరాజు ధనుంజయరాజు, భౌమరాజు సత్యన్నారాయణరాజు కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు. అంతకముందు ఆలయం వద్ద చండీ హోమాన్ని అర్చకులు నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.



అన్న సమారాధన నిర్వహిస్తున్న దృశ్యం

సత్యవాడ దుర్గాప్రసాద్ ఎంపిక పట్ల హర్షం



సత్యవాడ దుర్గాప్రసాద్‌ను అభినందిస్తున్న సమాఖ్య సభ్యులు

ఏలూరు రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య అడ్వైజరీ కమిటీ ఛైర్మన్‌గా సత్యవాడ దుర్గాప్రసాద్ ఎంపిక పట్ల సంఘ ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికయ్యారు. సమాఖ్య రాష్ట్ర సర్వసభ్య సమావేశంలో అనంతపురం జిల్లా గుంతకల్లులోని వాసవీ కల్యాణ మండపంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సమాఖ్య అడ్వైజరీ కమిటీ ఛైర్మన్‌గా ఏలూరు నగరానికి చెందిన సత్యవాడ దుర్గాప్రసాద్‌ను నియమించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ప్రజలకు తాను చేసిన నిస్వార్థ సేవలను గుర్తించి ప్రత్యేక తీర్మానం ద్వారా అడ్వైజరీ కమిటీ ఛైర్మన్‌గా నియమించారని తెలిపారు. ఈ మేరకు నగరంలోని ప్రముఖులు, పలు బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు హర్షం ప్రకటించారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే చంటి

ఏలూరుటూటౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగానే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కొమడవోలు గ్రామ రైతు ఎమ్మెల్యేను కలిసి తమ సమస్యలు చెప్పుకున్నారు.రహదారి నిర్మాణ విషయంలో తమ పొలాలు కోల్పోయామని న్యాయం చేయాలని వేడుకున్నారు. రైతులు తమకు రావల్సిన పరిహారం ఇప్పించాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులెవ్వరు అధైర్యపడొద్దని రైతులను అన్ని విధాలా ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రైతులందరికీ నష్టపరిహారం అందేలా తగు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పి.కిశోర్, పి.రాజేష్, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.



రైతుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చంటి

బీజేపీని మరింత బలోపేతం చేయాలి : చౌదరి



పార్టీలోకి ఆహ్వానిస్తున్న గారపాటి చౌదరి

ఏలూరురూరల్, మార్చి 18(ఆంధ్రజ్యోతి) : ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని బిజెపి బూత్, మండల కమిటీలను పూర్తి చేసి పార్టీ సంస్థాగత బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి కోరారు. మంగళవారం ఏలూరు జిల్లా బీజేపీ కార్యాలయంలో పార్టీ అసెంబ్లీ సంస్థాగత వ్యవహారాలపై ముఖ్య నేతలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు చౌటపల్లి విక్రమకిషోర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయచౌదరి పాల్గొని నాయకులకు పలు సూచనలు చేశారు. త్వరితగతిన కమిటీలను పూర్తి చేసి పార్టీ బలోపేతానికి బాధ్యతగా కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా నగరానికి చెందిన 50మంది బీజేపీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. సమావేశంలో ఎన్.దాన భాస్కర్, కె.కృష్ణ, గాది రాంబాబు, ఎం.రామకృష్ణ, పి.జ్యోతి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రానీయకండి

సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ రాంబాబు

చింతలపూడి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : వేసవి నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని మండలాధ్యక్షుడు డాక్టర్ బి.రాంబాబు నాయక్ అధికారులకు, ప్రజాప్రతినిధులకు సూచనలు ఇచ్చారు.మంగళవారం సర్వసభ్య సమావేశం ఎంపీడీవో కార్యాలయంలో రాంబాబు నాయక్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ఎక్సైజ్ అధికారులు మాట్లాడుతూ నవోదయం 2.0 కార్యక్రమం ద్వారా గ్రామాలను సారా రహిత గ్రామాలుగా తీసుకురావడానికి ప్రజాప్రతినిధులు సహకరించాలన్నారు. ఎలక్ట్రికల్ ఏఈ వెంకయ్య మాట్లాడుతూ గృహ వినియోగానికి సోలార్ ప్లాంట్‌ల ఏర్పాటుకు పథకం సిద్ధమైందని, ఇప్పటికే మండలంలో 40 ఇళ్లకు ఏర్పాటు చేశామని, ప్రజలు ముందుకు వస్తే బ్యాంకు సౌకర్యం కూడా ఉందని, దీనిని వినియోగించుకోవాలన్నారు. మండలాధ్యక్షుడు రాంబాబు మాట్లాడుతూ పంచాయతీల్లోని వీధిలైట్లు 24 గంటలు వెలగడం వల్ల వేడికి పగిలిపోతున్నాయని, పంచాయతీలలో ప్లాస్టిక్ వినియోగం పెరిగి పారిశుధ్యం ఇబ్బందిగా మారుతోందని, కుక్కలకు చర్మ వ్యాధుల వల్ల అవి పశువుల వద్దకు చేరడంతో రైతులు భయానికి గురవుతున్నారని పేర్కొన్నారు. నామవరం పంచాయతీలో మంచి నీటి కోసం ఒక్క ట్రాన్స్‌ఫార్మర్ పాడైతే బాగు చేయించినా లైన్‌మెన్ బిగించడంలేదని, రెండు నెలలుగా ఈ సమస్య ఉందని ఆ గ్రామ సర్పంచ్ వెంకటేశ్వరరావు అధికారుల దృష్టికి తెచ్చారు. సమావేశంలో ఎంపిడిఓ మురళీకృష్ణ, జడ్పీటిసి నీరజ, ఈవోపిఆర్‌డి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రాంబాబు



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు నాగేంద్ర

ఏపీ అభివృద్ధికి కేంద్ర సహకారం

ద్వారకాతిరుమల, మార్చి 18(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ సహకారం వల్లే ఏపీ అభివృద్ధి సాధ్యమవుతోందని బీజేపీ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర అన్నారు.మండలంలోని ఎం.నాగులపల్లిలో పార్టీ మండలాధ్యక్షుడు చిలకా వీరాస్వామి ఆధ్వర్యంలో మంగళవారం పార్టీ మండల సమావేశం జరిగింది. ముఖ్య అతిధిగా హాజరైన నాగేంద్ర మాట్లాడుతూ రానున్న స్థానిక పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో బీజేపీ కార్యకర్తలు ప్రజాప్రతినిధులుగా ప్రణాళిక రూపొందించాలని కోరారు. గోదావరి పుష్కరాల సమయానికి ముందే నియోజకవర్గ అభివృద్ధికి ఎంపీ పురందేశ్వరి చొరవతో ప్రత్యేక నిధులు తెచ్చి అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు శ్రీకృష్ణ భగవాన్, శెట్టిపల్లి శివనాగరాజు, మైలు శ్రీనివాస్, నిడమర్తి సత్యకుమార్, తాండ్ర సందీప్ పాల్గొన్నారు.



చెక్కును ఆలయ కమిటీకి అందజేస్తున్న దాతలు

రామాలయానికి భారీ విరాళం

జంగారెడ్డిగూడెం, మార్చి 18(ఆంధ్రజ్యోతి) : రామచంద్రపురంలోని శ్రీకోదండ రామాలయానికి భక్తులు భారీ విరాళాన్ని అందజేశారు. పట్టణానికి చెందిన పరిమి వెంకటరత్నం, ఝాన్సీరాణి కుమారుడు పవన్ కుమార్, కుమార్తె నవ్య రూ.5 లక్షల చెక్కును ఆలయ కమిటీకి అందజేసినట్టు ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు పరిమి సత్తిపండు మంగళవారం తెలిపారు. అలాగే పట్టణానికి చెందిన పామ్ ఉడ్స్ రియల్ ఎస్టేట్ యజమానులు లక్ష రూపాయల విరాళం అందజేశారన్నారు.ఈ కార్యక్రమంలో పరిమి ధర్మరాజు, కొండ్రెడ్డి కిషోర్, మోతుకూరి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

యానిమేటర్ల పనితీరుపై అభ్యంతరం

ఉంగుటూరు, మార్చి18(ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెలుగు యానిమేటర్లు పథకాలను డ్వాక్రా సంఘాలకు తెలియజేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారంటూ పలువురు సర్పంచులు ఆరోపించారు.మంగళవారం ఉంగుటూరు మండల పరిషత్ సమావేశం ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో వివిధ గ్రామాల సర్పంచులు మాట్లాడుతూ వెలుగు పథకం యానిమేటర్ల పనితీరుపై ఏ.పి.ఎం. ప్రభావతి లేవనెత్తడంతో పలువురు సర్పంచ్‌లు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో యానిమేటర్లు సరిగా పని చేయడం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీవో రాజ్ మనోజ్ మాట్లాడుతూ గ్రామాల్లో చెర్వులు ఆక్రమణకు గురికాకుండా పర్యవేక్షించా ఆదాయం పెంచుకోవాలని సూచించారు. విద్యుత్ ఏ.ఈ. వేణు మాట్లాడుతూ సూర్యఘర్ పథకం గురించి వివరించారు. సమావేశంలో హెల్త్ డిపార్ట్‌మెంట్ ఆరోగ్య విస్తరణాధికారి శ్రీనివాసరావు, ఇరిగేషన్ ఏ.ఈ. సుధారాణి తమ శాఖల గురించి తెలియజేశారు. జడ్పీటీసీ కె.జయలక్ష్మి, వైస్ ఎంపీపీ శింగిరెడ్డి సూర్యనారాయణ, ఇన్‌చార్జి తహసీల్దార్ వై.పూర్ణచంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు ఆమోదంపై హర్షం



కందుల రమేష్

ఏలూరు టూటౌన్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీ కరణను మంత్రివర్గం ఆమోదం తెలపడం పట్ల ఎంఆర్పీఎస్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు కందుల రమేష్ హర్షం వ్యక్తం చేశారు. ఎంఆర్పీఎస్ కార్యాలయంలో మంగళవారం రమేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు వర్గీకరణకు మద్దతు తెలిపి దళిత పక్షపాతిగా మరోసారి నిరూపించుకున్నారని అన్నారు. ఎస్సీ వర్గీకరణతో సామాజిక న్యాయం జరుగుతుందన్నారు. దళితులందరికీ సమాన అవకాశాలు వస్తాయన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎస్సీ వర్గీకరణ చేసి చంద్రబాబు తన నిజాయితీ నిరూపించుకున్నారని అన్నారు. కార్యక్రమంలో రాజేశ్వరరావు, మురళీ, నాగేంద్రబాబు, జీ.ప్రసాద్, రమేష్, కుటుంబరావు, మాధవరావు, నాని పాల్గొన్నారు.

ముగిసిన సంచార సేవల ఒప్పందం

ఏలూరురూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో మూగ జీవాలకు సత్వర వైద్య సేవలు అందించేందుకు సంచార పశు వైద్యం అందుబాటులోకి వచ్చింది. అయితే ఈనెల 14వ తేదీతో ఒప్పందం ముగిసిపోవడంతో వాహనాలు నిలిచిపోయాయి. ఏలూరు రూరల్ మండలంలో దెందులూరు నియోజకవర్గానికి సంబంధించి రెండు సంచార పశు వైద్య సేవలు అంబులెన్సులను కేటాయించారు. ఈ నేపథ్యంలో ఆవులు, గొర్రెలు, గేదెలు, మేకలు జబ్బుల బారిన పడితే అత్యవసర సేవలు ఎలా అందుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

అప్పనవీడులో అన్నదానం

పెదపాడు, మార్చి 18(ఆంధ్రజ్యోతి) : అప్పన వీడులోని అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద దాతలు దేవభక్తుని శ్రీనివాస్, లక్ష్మి సహకారంతో భక్తులకు అన్నదానం నిర్వహించినట్టు ఆలయ ఈవో పి.తారకేశ్వరరావు తెలిపారు. మంగళవారం కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకోగా వారికి ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



సామూహిక వ్రతాలు నిర్వహిస్తున్న మహిళలు

ముగిసిన వార్షికోత్సవాలు

టి.నర్సాపురం, మార్చి 18(ఆంధ్రజ్యోతి) : బొరంపాలెంలోని శ్రీషిర్డీ సాయి ఆలయంలో మూడ్రోజులుగా నిర్వహించిన వార్షికోత్సవాలు మంగళవారంతో ముగిశాయి.ఉదయం నుంచి ఆలయం వద్ద భక్తులు బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున ఆలయం సాయి సత్యవ్రతాలు ఘనంగా నిర్వహించారు.అనంతరం భక్తులకు అఖండ అన్న సమారాధన నిర్వహించారు.

ఆలయ వార్షికోత్సవం

ఏలూరుకార్పొరేషన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : సత్రంపాడులోని లక్ష్మీగణపతిస్వామి ఆలయం 13వ వార్షికోత్సవాన్ని సోమ, మంగళవారాల్లో ఘనంగా నిర్వహించారు.స్వామికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, శ్రీ లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. ఏకరుద్రాభిషేకం జరిపిన అనంతరం స్వామి విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ పండితులు తూములూరి విశ్వనాథ శాస్త్రి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు రెండుచింతల రామచంద్ర శర్మ పర్యవేక్షణలో కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి సి.హెచ్. చిన నాగేశ్వరరావు, సిబ్బంది భక్తులకు తగిన ఏర్పాట్లు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకుని భక్తి సంకీర్తనలు ఆలపించి భజనలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ముగిసిన బ్రిడ్జి కోర్సు పరీక్షలు

ఏలూరు అర్బన్, మార్చి 18(ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ థియరీ పరీక్షల్లో భాగంగా మంగళవారం జరిగిన ద్వితీయ సంవత్సరం బ్రిడ్జి కోర్సు పరీక్షలకు జిల్లాలో మొత్తం 1,185 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 944 మంది హాజరయ్యారని ఆర్ఐవో కె.యోహాన్ తెలిపారు. వీటితో ఇంటర్ థియరీ పరీక్షలు పూర్తిగా ముగిశాయని వివరించారు.

బాధితురాలి చికిత్సకు సాయం

ఏలూరు అర్బన్, మార్చి 18(ఆంధ్రజ్యోతి) : క్యాన్సర్ వ్యాధి చికిత్స ఖర్చుల నిమిత్తం రూరల్ మండలం కొమడవోలు పంచాయతీ సాయి నగర్‌కు చెందిన సన్యాసమ్మకు రూ.10 వేలు అందజేశారు. ఈ ఆర్థిక సాయాన్ని మంగళవారం జడ్పీ సీఈవో భీమేశ్వరరావు చేతుల మీదుగా బాధితురాలికి అందజేశారు. సాయి హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ప్రతినిధులు కృష్ణ, సురేష్ బాబు, వెంకటరమణ, శ్రీధర్, ప్రకాశ్, కోటేశ్వరరావు, రవికుమార్, మోహన్, తదితరులు ఈ నగదును సమకూర్చారు.

పేకాట శిబిరంపై దాడి

పెదవేగి, మార్చి 18(ఆంధ్రజ్యోతి) : కొప్పాకలో పేకాట శిబిరం నిర్వహిస్తున్నారనే సమాచారంతో సోమవారం రాత్రి పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్టు పెదవేగి ఎస్ఐ కె.రామకృష్ణ తెలిపారు. ఈ దాడిలో వీరి నుంచి రూ.6,100 నగదు, 6 ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నామని, జూదరులను కోర్టులో హాజరు పరుస్తామని ఎస్ఐ తెలిపారు.


నిర్మానుష్యంగా కలిదిండి సెంటర్ ప్రధాన రహదారి

మండిన ఎండ

కలిదిండి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కలిదిండిలో మంగళవారం 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. నిత్యం జనంతో రద్దీగా ఉండే ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారాయి. దుకాణాలు వెలవెలబోయాయి. ప్రయాణికులు లేక ఆర్టీసీ బస్సులు ఖాళీగా రాకపోకలు సాగించాయి.


రికవరీ చేసిన చోరీ సొత్తును చూపిస్తున్న ఖమ్మం సీపీ సునీల్‌దత్

ఇళ్లల్లో దోచి.. శ్మశానాల్లో దాచి..

అంతర్‌రాష్ట్ర వెరైటీ దొంగ సురేందర్ అరెస్టు

- రూ.45 లక్షల విలువైన సొత్తు స్వాధీనం
- ఏపీ, తెలంగాణల్లో 90 చోరీ కేసుల్లో నిందితుడు
- పారిపోయే క్రమంలో సత్తుపల్లిలో కానిస్టేబుల్‌పై దాడి
- వలపన్ని పట్టుకున్న పోలీసులు

సత్తుపల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో 90 చోరీ కేసుల్లో నిందితుడిగా ఉన్న తిరువీధుల సురేందర్‌ను మంగళవారం సత్తుపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. సురేందర్ ఈనెల 10వ తేదీన సత్తుపల్లిలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా కానిస్టేబుల్ నరేష్ గమనించి అనుసరించాడు. దీంతో సురేందర్ కత్తితో నరేష్‌పై దాడిచేసి పరారయ్యాడు. అప్పటినుంచి అతడి ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తూ మంగళవారం ఎట్టకేలకు పట్టుకున్నారు. సురేందర్ ఏలూరు జిల్లా చాట్రాయి మండలం చిత్తాపూర్ వాసి. గత నవంబర్‌లో రాజమండ్రి జైలు నుంచి విడుదలైన తర్వాత సురేందర్ తెలుగు రాష్ట్రాలలో తిరిగి చోరీలు చేయడం మొదలుపెట్టాడు. తెలంగాణలోని ఖమ్మం, కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, సూర్యాపేట, నల్లగొండ జిల్లాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో 3 నెలల కాలంలో 43 కేసులలో నిందితుడిగా ఉన్నాడు. సురేందర్ గూగుల్ మ్యాప్ ద్వారా ఇళ్లను గుర్తించి చోరీలకు పాల్పడుతుంటాడు. చోరీ అనంతరం శ్మశాన వాటికల్లో షెల్టర్ తీసుకోవడంతో పాటు చోరీ సొత్తుకూడా శ్మశానాల్లోనే దాచిపెడతాడు. మంగళవారం అందిన సమాచారం మేరకు సత్తుపల్లి మండలం కొత్తూరు సమీపంలోని శ్మశాన వాటిక వద్ద సురేందర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి 461.18 గ్రాముల బంగారు, 426 గ్రాముల వెండి, రూ.3.33లక్షల నగదు, మొబైల్ ఫోన్, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.45 లక్షలు ఉంటుంది.

మొదటిసారిగా తల్లికి చీర కొనడానికి చోరీ

సురేందర్ నుంచి మారణాయుధాలు స్వాధీనం చేసుకుని అతన్ని అరెస్ట్ చేసి హత్యాయత్నం, చోరీ కేసులు నమోదు చేసి రిమాండ్ చేసినట్లు కమిషనర్ తెలిపారు. సురేందర్ తన తల్లికి చీర కొనివ్వాలనే కోరికతో మొట్టమొదటి సారి రూ.300 చోరీ చేసి చీర కొనుగోలు చేశాడని, అప్పటి నుంచి చోరీలు కొనసాగిస్తూ అంతర్‌రాష్ట్ర దొంగగా మారాడని కమిషనర్ వివరించారు.

పోలీసులకు రివార్డులు

కాగా, సురేందర్ ఆచూకీ కనుగొనే క్రమంలో తీవ్రంగా గాయపడిన కానిస్టేబుల్ నరేష్‌తో పాటు అతడిని ఆసుపత్రికి తరలించిన పౌరులు ఇల్లంగి రాజు, చెరుకుపల్లి ప్రసాద్‌లను కమిషనర్ ప్రత్యేకంగా అభినందించి నగదు రివార్డు అందజేశారు. వీరితో పాటు సురేందర్‌ను అరెస్ట్ చేసిన ఎస్‌ఐ టి.కవిత, కానిస్టేబుళ్లకు ప్రశంసాపత్రాలతో పాటు క్యాష్ అవార్డులను అందజేశారు. విలేకరుల సమావేశంలో కల్లూరు ఏసీపీ ఎ.రఘు పాల్గొన్నారు.

నకిలీ నోట్ల కలకలం

వేలేరుపాడులో వ్యాపారులు, ప్రజల ఆందోళన



వేలేరుపాడు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): వేలేరుపాడులో నకిలీనోట్లు కలకలం రేగుతున్నది. అసలు నోట్లను పోలిన రూ.500 నకిలీ నోట్లు చలామణిలో ఉన్నాయి. రూ.500 నకిలీనోట్లు ఐదు బహిర్గతం కావడంతో ఈ విషయం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. వేలేరుపాడులోని ఒక మహిళకు రేపాకగొమ్ము గ్రామానికి చెందిన ఒక యువకుడు బాకీ కింద ఐదు రూ.500నోట్లు ఇవ్వగా వాటిని చిల్లరగా మార్చుకునే క్రమంలో స్థానిక బ్రాందీషాపు వద్దకు వెళ్లగా అక్కడ వాటిని పరీక్షించగా నకిలీనోట్లని తేలింది. దీనిపై బ్రాందీషాపు నిర్వాహకులు ఈ నోట్లు ఎవరు ఇచ్చారని సదరు మహిళను ప్రశ్నించారు. అప్పటికే అక్కడ ఉన్న మందుబాబులకు ఈ విషయం తెలియడంతో మండల వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. నకిలీనోట్లు ఇచ్చిన సదరు యువకుడి వ్యవహార శైలిపైన పలు అనుమనాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో ఎన్నడులేని విధంగా రూ.500 నోట్ల కట్టలను జేబులో పెట్టుకుని విచ్చలవిడిగా ఖర్చులు చేయడం చూస్తుంటే మరెవరినుంచైన నకిలీనోట్లు ఈ యువకుడి ద్వారా చలామణి అవుతున్నాయా అని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భద్రాచలంలో ఉండే ఈ యువకుడి బంధువు వ్యవహారశైలి కూడా అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. అనతికాలంలోనే ధనవంతుడు అవడం కూడా అనుమానాలకు ఊతం కల్పిస్తుంది. మరొక అనుమానం కూడా ప్రజల నుంచి వ్యక్తమవుతుంది. ఈ ప్రాంతంలో రైతుల వద్ద నుంచి బయట ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారులు పెద్దఎత్తున మిర్చిని కొనుగోలు చేస్తున్నారు. వీరు కూడా రైతులకు నగదు రూపంలోనే చెల్లింపులు చేస్తున్నారు. వీరి ద్వారా ఏమైన నకిలీనోట్లు చలామణి అవుతున్నాయా అనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. నకిలీనోట్లు బయటపడటంతో స్థానిక వ్యాపారుల్లోనూ రైతుల్లోనూ తీవ్ర ఆందోళన నెలకొంది. 500 నోటును చూస్తేనే తీసుకోవడానికి వెనకాడుతున్నారు.

తాటియాకులగూడెంలో వ్యక్తిపై హత్యాయత్నం

రంగంలోకి క్లూస్, డాగ్ స్క్వాడ్‌లు



జీలుగుమిల్లి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): తాటియాకులగూడెంలో ఒక వ్యక్తిపై గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం వేకువ జామున హత్యాయత్నం చేశారు. ఈ దాడిలో గ్రామానికి చెందిన గందం బోసు తలకు తీవ్రగాయం అయ్యింది. అతడిని కుటుంబ సభ్యులు ఖమ్మం ఆస్పత్రికి తరలించగా కోమాలోకి వెళ్లినట్లు వైద్యులు తెలిపారన్నారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. గ్రామానికి చెందిన గందం బోసు గతంలో ఉపాధి హామి ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేసి సస్పెండ్ అయ్యాడు. మంగళవారం ఉదయం స్థానికులు అతడిపై హత్యయత్నం జరిగింది. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు విచారణ జరుపుతున్నారు. క్లూస్ టీం, డాగ్‌స్క్వాడ్ పరిసర ప్రాంతాల్ని పరిశీలించాయి. బాధితుడికి ఎవరైనా శత్రువులు ఉన్నారా, అతడిపై హత్యాయత్నానికి ఇతర కారణాలు ఎమైనా ఉన్నాయా, కుటుంబ నేపథ్యం వంటి అంశాలపై పోలీసుల విచారణ కొనసాగుతున్నది.

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి

కైకలూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కైకలూరు రైల్వేస్టేషన్ సమీపాన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మంగళవారం ఉదయం గుడివాడ-భీమవరం రైల్వే లైన్లో కైకలూరు 91వ గేటు సమీపాన తెల్లవారుజామున వెళ్లే రైలు నుంచి ఒక యువకుడు ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందాడు. రైల్వే అధికారుల సమాచారం మేరకు భీమవరం జీఆర్పీఎఫ్ పోలీసులు మృతదేహాన్ని భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి వివరాలు తెలియలేదు.

కాలువల అభివృద్ధి పనులు పూర్తిచేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

కైకలూరు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): పంట, మురుగు కాలువలన్నీ రెండు నెలల్లో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి ముంపునకు ఆస్కారం లేకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. కైకలూరులో ఇరిగేషన్, డ్రైనేజీ, ఆర్‌డబ్ల్యూఎస్, డీసీ చైర్మన్లతో పంట, మురుగు కాలువల అభివృద్ధిపై మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వంలో కాలువలను నిర్లక్ష్యం చేశారని, ఎక్కడికక్కడ కిక్కిస అలుముకొని నీటి పారుదల అధ్వానంగా తయారైందన్నారు. నియోజకవర్గంలోని మురుగు, పంటకాలువల అభివృద్ధికి నలుగురు వ్యక్తులతో కమిటీ ఏర్పాటు చేశారని వీరి ద్వారా నిధులను ఖర్చు చేస్తున్నామన్నారు. వర్షాకాలం ముంపు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పంటకాలువ గట్లు బలహీనంగా ఉన్నచోట్ల వాటిని పటిష్ఠం చేయాలన్నారు.మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, ఎంపీపీ అడవి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

అగ్నిప్రమాదంలో పిట్టలోళ్ళ గుడిసెలు దగ్ధంకావడం బాధాకరమని వారి కుటుంబాలను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి నిధులను అందిస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కైకలూరు ట్రావెలర్స్ బంగ్లాలో సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. మండవల్లి మండలం భైరవపట్నం గ్రామంలో చెరువులపై కాపాలా ఉంటున్న 8 మందికి చెక్కులను అందజేస్తున్నామన్నారు. అలాగే నియోజకవర్గంలోని మరో 10 మందికి అందజేశారు. అనంతరం పీఎం అజయ్ పథకం ద్వారా ఎస్సీ లబ్దిదారులకు నలుగురికి వ్యాపార అభివృద్ధికి రూ.29.50 లక్షలకు చెక్కులను పంపిణీ చేశారు. పెన్మెత్స త్రినాథరాజు, పూల రామచంద్రరావు, కొల్లి వరప్రసాద్, నారగాని నాగేశ్వరరావు, గంగుల ఏసురాజు, బొంగు రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.


ఆల్ ఇండియా బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపక బృందం

ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు వైవీఎన్నార్ విద్యార్థినులు

కైకలూరు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు కైకలూరు వైవీఎన్నార్ డిగ్రీ కళాశాల విద్యార్థినులు ఎంపికవడం అభినందనీయమని ప్రిన్సిపాల్ వై.శ్రీలత అన్నారు. కృష్ణా యూనివర్సిటీ మహిళల అంతర కళాశాలల పోటీల్లో వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ద్వితీయస్థానం సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ నెల 17న విజయవాడ సిద్ధార్థ మహిళా కళాశాలలో నిర్వహించిన పోటీల్లో కైకలూరు కళాశాలకు చెందిన జి.స్రవంతి, కోటేశ్వరమ్మ, షారోన్‌రోజా, నవ్య ద్వితీయ స్థానం సాధించడంతో ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ ఉదయప్రకాష్ పాల్గొన్నారు.



ఉనికిలిలో శిలువ యాత్ర

మండవల్లి మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఉనికిలిలో ఫాదర్ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో క్రైస్తవులు మంగళవారం శిలువ యాత్ర నిర్వహించారు. ఉనికిలి రోమన్ కేథలిక్ మిషన్ సంఘం విశ్వాసులు శిలువతో ఊరేగింపు నిర్వహించారు. ఏసు ప్రేమతత్వాన్ని బోధించారని, పొరుగువారిపై ప్రేమతో ఉండాలని ఫాదర్ అనిల్‌కుమార్ పేర్కొన్నారు.

చేపల చెరువు తవ్వకం అడ్డగింపు

ముదినేపల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా బొమ్మినంపాడు ఏరియాలో చేపల చెరువు తవ్వుతున్నారన్న ఫిర్యాదులపై రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగారు. సుమారు 6 ఎకరాల్లో చెరువు తవ్వకం ఒక రైతు చేపట్టారని, సుమారు ఎకరం పోరంబోకు భూమి కూడా చెరువులో కలిసిపోయే పరిస్థితి ఉందని కొందరు సమాచారం ఇవ్వడంతో వీఆర్వో వెంకటేశ్వరరావు చెరువు తవ్వకాన్ని పరిశీలించారు. తవ్వకం పనులను మంగళవారం పూర్తిగా నిలిపేశారు. తవ్వకం చేపట్టిన భూముల రికార్డులను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు.

వనామి సీడ్‌కు పీసీఆర్ పరీక్షలు చేయించాలి



పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న అధికారులు

కలిదిండి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): వనామి రొయ్యలు వైరస్ బారిన పడకుండా ఉండాలంటే వనామి సీడ్‌కు ల్యాబ్‌లో పీసీఆర్ (పోలిమర్స్ చైన్ రియాక్షన్) పరీక్షలు తప్పనిసరిగా చేయించాలని మండల మత్స్యశాఖాభివృద్ధి అధికారి రవికుమార్ అన్నారు. మంగళవారం పోతుమర్రు కాళ్లపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుతం చెరువుల్లో వేసిన వనామి సీడ్ 30-40 రోజులు పూర్తయ్యేసరికి వైరస్ సోకి చనిపోతుండడంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నా రన్నారు. సీడ్ దశలో నాణ్యత కలిగిన రొయ్య పిల్లలను ఎంపిక చేసుకోవాలన్నారు. సర్టిఫైడ్ కలిగిన హేచరీల్లో పిల్-15 (పోస్టు లార్వా) రొయ్య పిల్లలను ఎంపిక చేసుకుని పీసీఆర్ పరీక్షలు జరిపిన తర్వాత చెరువుల్లో వేయాలన్నారు. ఆరోగ్యవంతమైన రొయ్య పిల్లలు గోధుమ రంగులో ఉంటా యన్నారు. ఎరుపు, నలుపు రంగులో ఉంటే వైరస్ సోకిన పిల్లలుగా గుర్తించాలన్నారు. నీటికి ఎదురీతతో ముందుకు సాగుతున్న రొయ్య పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందన్నారు. చెరువుల్లో రొయ్య పిల్లలు వేసినప్పటి నుంచి పోషక విలువలు గల మేత వేయాలన్నారు. మత్స్యశాఖ అధికారుల సూచనలతో ఆక్వా సాగు చేస్తే తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు సాధించవచ్చన్నారు. మండల వ్యవసాయాధికారి విద్యాసాగర్, విలేజ్ ఫిషరీష్ అసిస్టెంట్ రవితేజ, రైతులు పాల్గొన్నారు.

ఓర్పుతో రోగులకు వైద్యసేవలందించాలి


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరమణ

కైకలూరు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాసుపత్రిలో రోగులకు మెరుగైన సేవలందించాలని ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ పూను కొల్లు వెంకటరమణ అన్నారు. మంగళవారం కైకలూరు సామాజిక ఆరోగ్యకేంద్రం అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వాసుపత్రిలో సిబ్బంది ఓర్పు, సహనంతో పనిచేసి రోగులకు మంచి సేవలందించాలన్నారు. ఆసుపత్రి ఆవరణలో రోగుల భోజన వసతి కోరం ప్రత్యేక షెడ్డు నిర్మాణాన్ని కమిటీ సభ్యులు సొంత ఖర్చులతో చేపడతామన్నారు. కమిటీ సభ్యులు తానా ప్రసాద్, మన్నె శ్రీనివాసరావు, ఆసుపత్రి సూపరింటెండెంట్ అల్లాడి శ్రీనివాస్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.


అల్లూరు హైస్కూలు విద్యార్థి అమూల్యను అభినందిస్తున్న హెచ్ఎం, ఎస్ఎంసీ చైర్మన్

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో అమూల్య ప్రతిభ

ముదినేపల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా పులివెందులలో ఈ నెల 16న జరిగిన పాఠశాలల విద్యార్థుల రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ చూపించిన అల్లూరు జడ్పీ హైస్కూల్ విద్యార్థిని పక్కిరి అమూల్యను హైస్కూలు హెచ్ఎం రామోజీ, ఎస్ఎంసి చైర్మన్ శీలం వెంకట శ్యామల అభినందించారు. తృతీయ స్థానం సాధించిన ఉమ్మడి కృష్ణా జిల్లా టీములో పాల్గొన్న అమూల్యను పీఈటీ వెంకటేశ్వరరావును మంగళవారం హైస్కూలు అధ్యాపకులు అభినందించారు.

చెస్ క్రీడాకారుడికి నగదు ప్రోత్సాహం

నూజివీడు టౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): నూజివీడు సీబీఎస్సీ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న చెస్ క్రీడాకారుడు కొల్ల భవన్‌కు మంత్రి కొలుసు పార్థసారథి పంపిన రూ.లక్ష ప్రోత్సాహకాన్ని మంగళవారం మునిసిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, ఫ్లోర్ లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్ అందజేశారు. కొల్ల భవన్ వరుసగా 5 సార్లు రాష్ట్ర ఛాంపియన్‌గా గెలిచాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా కొల్ల భవన్ మరిన్ని టోర్నమెంట్లలో పాల్గొనటానికి అవరోధం ఏర్పడింది. దీనితో మంత్రి రూ.లక్ష పంపించారు. చెస్‌లో ప్రతిభ చూపుతున్న భవన్‌ను పాఠశాల చైర్మన్ పీవీ కుమార్, టీడీపీ నాయకులు గొగినేని మధు, గద్దె రఘుబాబు, సాంబశివరావు అభినందించారు.

పేకాట శిబిరాలపై దాడి

నూజివీడు, మార్చి 17(ఆంధ్రజ్యోతి) వేర్వేరు ప్రాంతాల్లో పోలీసులు దాడి చేసి 13 మంది పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 14780 రూపాయలు స్వాధీన పరుచుకున్నట్లు నూజివీడు రూరల్ ఎస్ఐ లక్ష్మణబాబు తెలిపారు. రేగుంటలో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని 10570 రూపాయల నగదు, మరో ప్రాంతం పోలసానిపల్లిలో పేకాట శిబిరంపై దాడిచేసి ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారివద్ద నుంచి 4210 నగదును స్వాధీనపరుచుకున్నట్లు ఆయన తెలిపారు.

సారా విక్రయదారుడిపై కేసు

ముసునూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): లోపూడి గ్రామంలో ఏలూరు జిల్లా అసిస్టెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ సీ.హెచ్ అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన దాడుల్లో మరీదు నాగేశ్వరరావును అదుపులోకి తీసుకుని, ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. నిందితుడితోపాటు నారా సరఫరా చేస్తున్న చింతలపూడి మండలం నాగిరెడ్డిగూడెంకు చెందిన ఇస్లావతు గోపిపై కూడా కేసు నమోదు చేసినట్లు అజయ్‌కుమార్ తెలిపారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ పి.యస్ భోగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	105, 114, 125
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210

నెక్ కోడి గుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.475



చాట్రాయిలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏవో, రైతులు

ఆధునిక వ్యవసాయ పద్ధతులు ఆచరించాలి

చాట్రాయి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు అనుసరించి ప్రయోజనాలు పొందాలని ఏవో శివశంకర్ కోరారు. చాట్రాయిలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులతో కలిసి మొక్కజొన్న తోటలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ మొక్కజొన్న కండెలు ఆరబెట్టేటప్పుడు కల్లంలో అడుగున టార్పాలిన్ పట్టా వేయటం వలన తీవ్రమైన ఎండలకు మొక్కజొన్న పంట నాణ్యత దెబ్బతినకుండా ఉంటుందన్నారు. మొక్కజొన్న కండెలు విరిసిన తరువాత చొప్పను భూమిలో కలియ దున్నటం వలన సేంద్రియ కర్బన పదార్థం పెరుగుతుందని అన్నారు.

పెన్షన్ కోసం దివ్యాంగుడి ఎదురుచూపు


సదరం సర్టిఫికెట్‌ను చూపుతున్న పుల్లయ్య

ముసునూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): వేల్పుచర్ల గ్రామానికి చెందిన తొమ్మండ్రు పుల్లయ్య (54) ఎడమకాలుకు రక్తప్రసరణ లేక ఇన్ఫెక్షన్ కావడంతో కాలును గత ఏడాది క్రితం తీసివేశారు. కూలి పనులు చేసుకుంటు జీవనం సాగిస్తున్న పుల్లయ్యకు కాలు తొలగించడంతో ఉపాధి కోల్పోయాడు. అయితే దివ్యాంగ పెన్షన్‌తోనైన జీవనం సాగించుకోవచ్చు అని గత ఏడాది ఆగస్టులో సదరం సర్టిఫికెట్‌ను తీసుకున్నాడు. గత వైసీపీ ప్రభుత్వంలో పెన్షన్ కోసం పలుమార్లు దరఖాస్తు చేసుకుని, నాటి నుంచి అధికారుల చుట్టు ప్రదక్షిణాలు చేస్తూ, ఎదురు చూస్తున్నాడు. అయిన నేటికి పెన్షన్ మాత్రం మంజూరు కాలేదు. ప్రతి రోజు కూలి పనులకు వెళ్ళి కుటుంబాన్ని పోషించుకునే వాడిని, కాలు తొలగించడంతో కనీసం ఒక పూట భోజనానికి కూడా గడవడం లేదని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. పెన్షన్ మంజూరు చేసి అదుకోవాలని పుల్లయ్య అధికారులను కోరుతున్నాడు.

రైతులు విశిష్ట సంఖ్య నమోదు చేయించుకోవాలి


కాట్రేనిపాడులో కరపత్రాలను ప్రదర్శిస్తున్న రైతులు, అధికారులు

ముసునూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు విశిష్ట సంఖ్య నమోదును తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి సూరిబాబు కోరారు. మంగళవారం కాట్రేనిపాడులో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సేవా కేంద్రంలో రైతులతో జరిగిన సమావేశంలో ఏవో మాట్లాడుతూ సొంత భూమి ఉన్న ప్రతి రైతు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన విశిష్ట సంఖ్య నమోదును ఆర్ఎస్‌కేల్లో చేయించుకోవాలన్నారు. ఈ సంఖ్య రిజిస్ట్రేషన్ చేయించుకోవడం వల్ల రైతులకు ప్రభుత్వ సబ్సిడీ పథకాలు, రాయితీలతోపాటు అనేక ప్రయోజనాలను పొందేందుకు అర్హత ఉంటుందన్నారు. ఈ ప్రక్రియను వేగవంతం చేసి త్వరిగతిన పూర్తిచేయాలని ఏవో వీహెచ్ఏలు, వీఏఏలను ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ గద్దల సుహాసిన మోహన్‌రావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.


దివ్యాంగ బాలుడికి చికిత్స చేస్తున్న డాక్టర్ ప్రశాంతి

ఉచిత ఫిజియోథెరపీ

ముసునూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రమణక్కపేట మెయిన్ పాఠశాలలో ఉన్న భవిత సెంటర్‌లో దివ్యాంగులకు ఉచిత ఫిజియోథెరపీ శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐదుగురు పిల్లలకు డాక్టర్ ప్రశాంతి ఫిజియోథెరపీ చికిత్సను అందించి, వారి పట్ల తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

రేషన్ లబ్ధిదారులకు ఈకేవైసీ తప్పనిసరి

ముసునూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని తహసీల్దార్ కె.రాజ్‌కుమార్ అన్నారు. మంగళవారం లోపూడిలో జరుగుతున్న ఈకేవైసీ ప్రక్రియను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఉన్న రేషన్ దుకాణాల పరిధిలో లబ్ధిదారులతో ఈకేవైసీ చేయించాలని రేషన్ డీలర్లను ఆదేశించారు. ఈ ప్రక్రియను వీఆర్వోలు పర్యవేక్షించి, త్వరిగతిన పూర్తిచేయాలన్నారు.

21న చాట్రాయి మండల సమావేశం

చాట్రాయి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): చాట్రాయి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం 21వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీపీ లంకా నిర్మల అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు తప్పని సరిగా హాజరుకావాలని ఎంపీడీవో కోరారు.

వర్గీకరణకు మంత్రివర్గం ఆమోదం పట్ల హర్షం

చాట్రాయి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై ఏకసభ్య కమిషన్ ఇచ్చిన నివేదికను రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించటం పట్ల మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మొలుగుమాటి రవిరామ్, మండల నాయకులు గార్లపాటి మారేష్, కోట జోషి, చౌటపల్లి రాంబాబు, కలపాల రమేష్ కొప్పుల ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు.